01ATP30F_01ATP30F.qxd 30-01-2024 PM 11:38 Page 1

అనంతపురం/శ్రీ సత్యసాయి
తెలుగు జాతీయ దినపత్రిక
వార్త
బుధవారం 31 జనవరి 2024 పేజీలు : 04

# కొండను తవ్వారు... ...కొల్లగొట్టారు



- ప్రజల ప్రాణాలు గాలిలోకి..క్వారీల ఆదాయం అధికారుల జేబులోకి
- అక్రమ క్వారీలతో ప్రభుత్వ ఆదాయానికి గండి
- తహశీల్దార్, విఆర్ఓ ఒకరిపై ఒకరు నిందలు..!

అక్రమంగా క్వారీలు నిర్వహిస్తున్న ఎర్రోనిపల్లి కొండలు

**ధర్మవరం, జనవరి 30 ప్రభాతవార్త**

చెన్నేకొత్తపల్లి మండలంలో అక్రమ క్వారీలతో కళ్లెదుటే కొండలాంటి బండలను కొట్టి విలువైన రాయిని కొల్లకొడుతున్నారు. అక్రమ సంపాదనకు అలవాటు పడిన అధికార పార్టీ నాయకులు రాత్రి పగలు తేడా లేకుండా విలువైన రాయిని అమ్మి సొమ్ము చేసుకుంటున్నారు. ఎంతలా తరలిస్తున్నారంటే రాయి తరలించే సమయంలో ఆ రాళ్ల కిందపడి మనుషుల ప్రాణాలు పోయేంతగా తరలిస్తున్నారు. ఇంత జరుగుతున్నా అధికార యంత్రాంగానికి మాత్రం చీమకుట్టినట్లు కూడా లేదు. విషయం తెలిసిన చూసి చూడనట్లు వ్యవహరిస్తున్నారు. స్థానిక అధికార యంత్రాంగం తమ చెయ్యి తడిపితే చాలు అన్నట్లు అక్రమ మైనింగ్‌ను ఆదాయ వనరుగా మార్చుకున్నారనే ఆరోపణలు స్థానిక గ్రామ అధికారులపై వినిపిస్తున్నాయి. సాక్ష్యాత్తు మండల మెజిస్ట్రేట్ ఈ విషయంపై చర్యలు చేపట్టాలని గ్రామ రెవెన్యూ అధికారికి హుకుం జారీ చేసినప్పటికి అక్రమ మైనింగ్‌కు పాల్పడుతున్న అధికారపార్టీ నాయకులకు ఈ విషయాన్ని సాకుగా చెప్పి అధిక మొత్తంలో లంచం డిమాండ్ చేసినట్లు ఆరోపణలు గుప్పుమంటున్నాయి.

### ప్రభుత్వ ఆదాయానికి గండి :

చెన్నేకొత్తపల్లి మండలం సరిహద్దు ప్రాంతమైన గంగినేపల్లి, ఎర్రోనిపల్లి, అడవి బ్రాహ్మణపల్లి ప్రాంతాల్లో ప్రతి రోజు వందల సంఖ్యలో ట్రాక్టర్లతో విలువైన గ్రానైట్ రాయిని తరలించి సొమ్ము చేసుకుంటున్నారు కొందరు అధికార పార్టీ నాయకులు, గృహ నిర్మాణానికి అవసరమైన విలువైన గ్రానైట్ రాయిని పగలు, రాత్రి తేడా లేకుండా తరలించడంపై స్థానిక గ్రామాల ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారుల అక్రమ సంపాదన కోసం విలువైన గ్రానైట్ రాయిని ప్రభుత్వ ఆదాయమారంగా కాకుండా తమ సొంత ఆదాయ మార్గంగా మార్చుకున్నారని స్థానిక అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు స్థానిక గ్రామాల ప్రజలు. చాలా కాలంగా ఈ తతంగ జరుగుతున్నప్పటికి ప్రభుత్వ అధికారుల్లో ఏమాత్రం చలనం లేదని స్థానిక ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

### అనుమతులు లేవు..వారికి ఆ అవసరం లేదు ?

ఎక్కడైనా క్వారీలు నిర్వహించాలన్న మైనింగ్ చేయాలన్నా ప్రభుత్వ అనుమతులు తప్పనిసరిగా తీసుకోవాల్సి వుంటుంది. అయితే చెన్నేకొత్తపల్లి మండలంలో మాత్రం అవన్నీ ఏవి అవసరంలేదు. కేవలం అధికారులకు ఆదాయం తెచ్చిపెట్టే అధికారపార్టీ నాయకులైతే చాలు. వారికి అనుమతులు అవసరం లేదు. వారి గురించి అధికారులు పట్టించుకోరు. అధికారులు చెప్పిన సమయానికి ఆదాయం అందిస్తే అనుమతులు అక్కర్లేదు. ఎంత గ్రానైట్ రాయి తరలించుకున్నా అధికారులు పట్టించుకోరు. స్థానిక ప్రజలు అనేకమార్లు ఫిర్యాదు చేసినా అధికారులు చూసి చూడనట్లు వ్యవహరిస్తున్నారు. మండల మెజిస్ట్రేట్ వారం రోజుల క్రితం చర్యలు తీసుకోవాలని గ్రామ రెవెన్యూ అధికారికి ఆదేశాలు చేసినప్పటికి ఆ ఆదేశాల అమలు మాత్రం లేదు. మండల మెజిస్ట్రేట్ ఆదేశాలకే దిక్కులేదంటే పరిస్థితి ఎంత దారుణంగా వుందో ఇట్టే ప్రజలకు అర్థమవుతోంది. ఇప్పటికైనా అధికారులు అక్రమ క్వారీలపై చర్యలు తీసుకుంటారా లేక ఆదాయ మార్గాలుగా మలుచుకుంటారా వేచి చూడాలి.



అక్రమ క్వారీలతో నేలమట్టమైన ఎర్రోనిపల్లి కొండలు

### ప్రజల ప్రాణాలు గాలిలోకి :

ఈ ప్రాంత గ్రామాల్లో రాళ్లతో వెళుతున్న ట్రాక్టర్ల రవాణాతో నిత్యం ప్రమాదాలు జరుగుతున్నాయి. రాళ్లతో వెళుతున ట్రాక్టర్ల ద్వారా ప్రమాదలు సంభవించి మనుషుల ప్రాణాలు కూడా పోగొట్టుకున్న సందర్భాలున్నాయి. ఇతం జరుగుతున్నప్పటికి అధికార యంత్రాంగానికి చీమకుట్టినట్లు కూడా లేకుండా పోయింది. ప్రశ్నించిన వారిపై అధికారపార్టీ నాయకులను పురమాయించి ఎక్కడికక్కడ ఫిర్యాదులను తొక్కి పెట్టడమే అధికార యంత్రాంగానికి తెలిసి వచ్చిన ఆయుధంగా మారిపోయింది. స్థానిక ప్రజలు మాత్రం ఎప్పుడు ఎవరి ప్రాణాలు పోతాయోనని భయబ్రాంతులకు గురవుతున్నారు. ఇప్పటికైనా అధికారులు చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.



ట్రాక్టర్‌లో అక్రమంగా గ్రానైట్ రాళ్లను తరలిస్తున్న దృశ్యం

### చెన్నేకొత్తపల్లి తహశీల్దార్ ఏమన్నారంటే :

ఇప్పటి వరకు గంగినేపల్లి ప్రాంతాల్లో అక్రమ క్వారీలు నిర్వహిస్తున్నట్లు తమ దృష్టికి రాలేదని గత రెండు రోజుల క్రితం కొంత మంది ఫోన్ ద్వారా సమాచారం తెలిపారు. మా వరకు స్థానిక విఆర్ఒకు చర్యలు తీసుకోమని తెలిపాము. అంతకుమించి మేము ఏమి చేయగలం. ఈ విషయం మైనింగ్‌శాఖకు కూడా సంబంధించినది వారు కూడా చర్యలు తీసుకోవాలి..తీసుకోలేదు, దానికి మేమేం చేయగలం.

## బిజెపికి మళ్లీ అధికారం ఇస్తే దేశం అధోగతి

- ❖ ప్రాంతీయ పార్టీలు రాష్టానికి సమాజానికి చీడ పురుగులు : రఘువీరారెడ్డి
- ❖ బాల ప్రదర్శన కోసం రాష్ట్రంలో పిసిసి అధ్యక్షురాలు పర్యటించడం లేదు
- ❖ రాజశేఖర్‌రెడ్డి ఆశయం సాధన కోసం జిల్లాల పర్యటన
- ❖ మడకశిర మళ్లీ మడకశిర నినాదంతో ప్రజల్లోకి



సమావేశంలో మాట్లాడుతున్న సిడబ్ల్యూసి మెంబర్ రఘువీరారెడ్డి

**మడకశిర టౌన్, జనవరి 30 ప్రభాతవార్త**

దేశంలో బిజెపి పార్టీకి అధికారం ఇస్తే దేశం అధోగతి పాలవుతుందని సిడబ్ల్యూసి మెంబర్ రఘువీరారెడ్డి మండిపడ్డారు. రాష్ట్రంలోని ప్రాంతీయ పార్టీలు రాష్ట్రానికి దేశానికి చీడపురుగుల్లాగా ఉన్నాయని వాటిని ప్రోత్సహించరాదని కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ సభ్యులు డాక్టర్ నీలకంఠాపురం రఘువీరారెడ్డి పేర్కొన్నారు. మంగళవారం మడకశిర పట్టణంలోని నీలకంఠ కోల్డ్ స్టోరేజ్‌లో నియోజకవర్గస్థాయి కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశానికి మాజీ ఎమ్మెల్యే సుధాకర్ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా రఘువీరారెడ్డి మాట్లాడుతూ.. రాష్ట్రంలో రాజన్న రాజ్యం తీసుకురావాలని దృడ సంకల్పంతో కొత్తగా రాష్ట్ర పార్టీ అధ్యక్షురాలుగా బాధ్యతలు చేపట్టిన షర్మిలారెడ్డి రాష్ట్రంలోని అన్ని జిల్లాలో పర్యటించడం జరిగిందని ఆమె పర్యటనలు విజయవంతం కావడంతో అధికార ప్రభుత్వానికి చెమటలు పట్టడం జరిగిందని దీనిని జీర్ణించుకోలేక ఆమెపై వ్యక్తిగత విమర్శలు చేయడంకు పూనుకున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి చనిపోవడానికి ముందు కాంగ్రెస్ పార్టీలో రాహుల్ గాంధీని దేశ ప్రధాని చేయాలని చెప్పడం జరిగిందని దీంతో అతని ఆశయ సాధన కోసమే ఆమె కాంగ్రెస్ పార్టీలో చేరి ఆ లక్ష్యం నెరవేర్చడానికి పని కట్టుకుని పని చేస్తుందని పేర్కొన్నారు. అయితే ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి షర్మిలారెడ్డి అడిగిన ప్రశ్నలకు సమాధానం ఇవ్వకుండా వ్యక్తిగత విమర్శలు చేస్తూ ప్రజలను



సమావేశానికి హాజరైన కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు

మిగతా 4లో..

## జగనన్న వెంట.. పద్మమ్మ

- జగనన్న మాటకు కట్టుబడుదాం..
- సమన్వయంతో పని చేద్దాం.. నా తమ్ముడు వీరాంజినేయులును గెలిపించుకుందాం : ఎమ్మెల్యే జొన్నలగడ్డ పద్మావతి
- నా మీద పెద్ద బాధ్యత పెట్టారు చిత్తశుద్ధితో పని చేస్తాను : వీరాంజినేయులు





మాట్లాడుతున్న ఎమ్మెల్యే జొన్నలగడ్డ పద్మావతి

**శింగనమల, జనవరి 30 ప్రభాతవార్త**

సామాజిక సమీకరణలో భాగంగా జగనన్న నిలబెట్టిన అభ్యర్థిని సమన్వయంతో కలిసికట్టుగా మనమందరం పని చేసి గెలిపించుకుందామని వైఎస్ఆర్‌సిపి నాయకులు, కార్యకర్తలకు ఎమ్మెల్యే జొన్నలగడ్డ పద్మావతి పిలుపునిచ్చారు. అనంతలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఆమె విలేకరుల సమావేశం నిర్వహించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ.. తెలుగుదేశం పార్టీ అధికారంలో ఉన్నపుపడు సమన్వయ కర్త ఎం.వీరాంజినేయులు కుటుంబ వైఎస్ఆర్‌సిపి తరపున సర్పంచుగా ఎన్నికై అక్కడ ప్రజలకు పార్టీకి సేవలందించారన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మాటకు కట్టుబడి నా తమ్ముడు వీరాంజి నేయులును వైఎస్ఆర్‌సిపి నాయకులు, కార్యకర్తలు, అభిమానులు ఆశీర్వదించాలన్నారు. నియోజకవర్గ సమన్వయ కర్త వీరాంజినేయులు మాట్లాడు తూ.. తనపై నమ్మకం ఉంచిన ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డికి, ఎమ్మెల్యే దంపతులకు ధన్యవాదాలు తెలిపారు. ఒక సామాన్య కార్యకర్తను ఎమ్మెల్యే అభ్యర్థిగా నిలబెట్టే ధైర్యం దమ్ము కేవలం జగనన్నకే ఉందని అన్నారు. నియోజకవర్గ ప్రజల ఆశీస్సులతో, ఎమ్మెల్యే దంపతుల సహకారంతో నియోజకవర్గ అభివృద్ధికి శక్తి వంచన లేకుండా పని చేస్తానని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా రైతు విభాగం అధ్యక్షులు యన్.వి.నారాయణ, మండల కన్వీనర్ అంకె నరేష్, ఎస్టీ సెల్ జిల్లా కార్యదర్శి శ్రీనివాస్ నాయక్, మండల కన్వీనర్ వరకూటి కాటమయ్య, గంగరాజు, రామచంద్రరెడ్డి, నాగలింగా తదితరులు పాల్గొన్నారు.

## కౌంటింగ్ కేంద్రం ఏర్పాట్లను పరిశీలించిన జిల్లా కలెక్టర్ అరుణ్ బాబు



కౌటింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ అరుణ్ బాబు

**గోరంట్ల,జనవరి 30,ప్రభాతవార్త**

రాబోవు సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో పట్టణంలో మాంటిషోరి ఇంగ్లీష్ మీడియం స్కూల్‌లోని స్ట్రాంగ్ రూమ్ కౌంటింగ్ హాలు, రిసెప్షన్ కేంద్రం ఏర్పాటునకు సంబంధించిన ఏర్పాట్లను మంగళవారం జిల్లా కలెక్టర్ పరిశీలించారు. ఈ కార్యక్రమంలో పెనుకొండ సబ్ కలెక్టర్ అపూర్వ భరత్, ఆర్డీఓలు పుట్టపర్తి భాగ్యరేఖ, కదిరి వంశీకృష్ణ, ధర్మవరం రమేష్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు. ఎన్నికల కమీషన్ అదేశాల ప్రకారం కొత్త మ్యానివల్‌ను అనుసరించి ఎలాంటి ఏర్పాట్లు చేపట్టాలి తదితర అంశాలపై అధికారులకు ప్రిన్సిపల్ రూమ్‌ను, ల్యాబ్‌లను పరిశీలించారు. 6.4 వెడల్పు, 15.4 పొడవు గల గదులను పరిశీలించి రెవెన్యూ వారు తయారు చేసిన మ్యాపులను క్షుణ్ణంగా పరిశీలించారు. ఏ ఒక్క ఓటరు కూడా పోలింగ్ కేంద్రానికి చేరుకోవడానికి రెండు కిలో మీటర్ల కంటే ఎక్కువ నడవరాదని ఉద్దేశంతో పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేయడానికి కార్యచరణ, ప్రణాలికలు అమలు చేయుచున్నామని తెలిపారు. కౌంటింగ్ కేంద్రాల నుంచి వెలుతురు ఉండే విధంగా ఏర్పాట్లు చేయడానికి అవసరమైన కేంద్రాలు గుర్తించడానికి క్షేత్రస్థాయిలో జిల్లాలో కౌంటింగ్ కేంద్రాలను పరిశీలించడం జరిగిందని కలెక్టర్ పేర్కొన్నారు. గోరంట్ల పట్టణంలో న్యూ మాంటోరియ పాఠశాలలో కదిరి, ధర్మవరం, పుట్టపర్తి నియోజకవర్గాల కౌంటింగ్ సంబంధించి రిసెప్షన్ సెంటర్ మరియు కౌంటింగ్ కేంద్రాలు ఇక్కడ ఏర్పాటు చేయడానికి స్థలాన్ని పరిశీలించారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ రంగనాయకులు, ఎన్నికల డిప్యూటి తహశీల్దార్ రెడ్డి శేఖర్, సిఐ సుబ్బరాయుడు తదితరులు పాల్గొన్నారు.

## ఎలాంటి ఒత్తిళ్ళకు తలొగ్గద్దు

- ఎన్నికల విధులపై ప్రతి ఒక్కకికీ అవగాహన ఉండాలి
- అలసత్వం, అవకతవకలకు పాల్పడితే చట్టం నుండి తప్పించుకోలేరు
- జిల్లా ఎస్‌పి ఎస్.వి.మాధవ రెడ్డి





సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా ఎస్‌పి ఎస్.వి.మాధవ రెడ్డి

**శ్రీసత్యసాయి జిల్లా ,జనవరి 30,ప్రభాతవార్త ప్రతినిధి:**

రాబోయే ఎన్నికల్లో ఎలాంటి ఒత్తిళ్ళకు తలొగ్గకుండా నిష్పక్షపాతంగా పని చేయాలని శ్రీసత్యసాయి జిల్లా ఎస్‌పి ఎస్.వి.మాధవ రెడ్డి పేర్కొన్నారు. మంగళవారం స్థానిక సాయి అరామం నందు ఎస్‌పి ఎస్.వి.మాధవ రెడ్డి ఆధ్వర్యంలో జనరల్ ఎన్నికలపై ఒకరోజు శిక్షణ కార్యక్రమంనిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా రిటైర్డ్ ఆర్‌డిఓ విశ్వనాథ్ విచ్చేశారు. ఈ సందర్భంగా ఎస్‌పి, రిటైర్డ్ ఆర్‌డిఓ విశ్వనాథ్‌లు మాట్లాడుతూ, ప్రస్తుతం నడుస్తున్న ఈ మూడు నెలలు అత్యంతక్లిష్టమైన రోజులని, మనంఅప్రమత్తంగాఉండకుంటే ఎన్నో సమస్యలను ఎదుర్కోవాల్సి వస్తుందన్నారు. ముఖ్యంగా సమస్యలు ఎక్కడ నుండి ఉత్పన్నమౌతున్నాయో తెలుసుకొని సకాలంలోపరిష్కరించుకోవాలని, అందుకు ఈ రోజు నుండి తగు చర్యలు తీసుకోవడానికి సమాయత్తంకావాలన్నారు. ఎన్నికలకోడ్ అమలైనప్పటి నుండి విధుల నిర్వహణ, పోలింగ్ స్టేషన్‌లలో, బూత్‌లలో విధులు ఏ విధంగా నిర్వహించాలి? సమస్యాత్మక పోలింగ్ స్టేషన్‌లు, గ్రామాలు, వార్డులను ప్రతి రోజూ ఎస్‌హెచ ఓలు, ఎస్‌డిపిఓలు సందర్శించి స్థానికులతో సమావేశమైన ముందస్తు సమాచారాన్ని సేకరించి ఎన్నికల నియమావలిని వివరించి, అక్కడ నివశిస్తున్న ఎలక్షన్ ట్రబుల్ మాంగర్స్ కదలికలను అరికట్టాలన్నారు. ఎస్‌హెచ్‌ఓలు అందరూ తమ పరిధిలోని ప్రతి పోలింగ్ స్టేషన్‌లో భౌగోళిక స్థితి గతులను తెలుసుకొని శాంతియుతంగా ఎన్నికలు నిర్వహించే విధంగా ప్రణాళికబద్ధంగా పనిచేయాలన్నారు. అమాయక ప్రజలను ఎన్నికల కేసుల్లో ఇరికించవద్దని, రాబోయే ఎన్నికల్లో ఏ అధికారి లేదా పోలీస్ సిబ్బంది పక్షపాతంతో వ్యవహరించకూడదన్నారు. పోలింగ్ స్టేషన్‌లో ఏదైనా అక్రమాలు జరిగినప్పుడు లేదా జరుగుతున్నట్టు తెలిస్తేమౌనం వహించరాదని, ఎన్నికల నిబంధనలు, విధులను ఉల్లంఘించిన వారిపై భారత ఎన్నికల సంఘం తీవ్రమైన చర్యలు తీసుకుంటుంద న్నారు. విధుల యందు వ్యక్తిగతం ఎలాంటి నిర్ణయాలు, పని చేయకూడదని, ఓటర్లను ప్రభావితం చేయడంలేదా ప్రలోభాలకు గురిచేయడం వంటి ఎలాంటి ఘటనలు కూడా జరగకుండా పోలిసులు

మిగతా 4లో..

## బాబుకు అవినీతి మరక అంటించలేరు

- సుప్రీం కోర్టు తీర్పుతో జగన్‌కు చెంప పెట్టు
- టిడిపి ఇన్‌చార్జ్ కందికుంట



మీడియా సమావేశంలో మాట్లాడుతున్న టిడిపి ఇన్‌చార్జ్ కందికుంట

**కదిరి, జనవరి 30 ప్రభాతవార్త**

మాజీ ముఖ్యమంత్రి ప్రతిపక్షనేత చంద్రబాబుపై ఎన్ని కేసులు పెట్టినా న్యాయ స్థానాల్లో ఆయనపై అవినీతి మరక అంటించ లేరని టిడిపి నియోజకవర్గ ఇన్‌చార్జ్ కందికుంట వెంకట ప్రసాద్ పేర్కొన్నారు. మంగళవారం తన నివాసంలో ఏర్పాటు చేసిన విలేకరులసమావేశంలో టిడిపిఇన్‌చార్జ కందికుంట వెంకట ప్రసాద్ మాట్లాడుతూ. సుప్రీం కోర్టుచేసిన వ్యాఖ్యలకు ఇప్పటికైనా జగన్‌రెడ్డికి వైసీపీ నాయకులకు సిగ్గు ఉండాలన్నారు. చంద్రబాబుపై పెట్టిన అక్రమ కేసుల్లో ఒక్కటైనానిరూపించ గలరన్నారు. ఇన్నర్ రింగు రోడ్డు కేసులో జగన్‌రెడ్డి ప్రభుత్వానికి ఎదురు దెబ్బ తగిలిందని, బాబుకు ముందస్తు బెయిల్ రద్దు చేయాలని ప్రభుత్వం వేసిన పిటీషన్‌ను సుఎప్రీం కోర్టు కొట్టి వేసిందన్నారు. చంద్రబాబునాయుడును ఇబ్బంది పెట్టాలని చూస్తున్న జగన్‌రెడ్డికి, ప్రభుత్వానికి సుప్రీం కోర్టు తీర్పు ఓ చెంప పెట్టు అన్నారు. అధికార గర్వంతో జగన్‌రెడ్డి అండ్ కో పెట్టిన కేసులు తప్పుడువని సుప్రీం కోర్టు తీర్పుతో వెల్లడైందన్నారు. ఐఆర్‌ఆర్‌కేసులో సహ నింధితులపై ఉన్న ఉత్తర్వులు చంద్రబాబుకు వర్తిస్తాయని సుప్రీం కోర్టుస్పష్టం చేసిందన్నారు. గతంలో హై కోర్టు ఇచ్చిన తీర్పును సుప్రీం కోర్టు సమరిధంచిందని, ఇపప్పటికైనా జగన్‌రెడ్డి, వైసీపీ నాయకులు సిగ్గు పడాలన్నారు. ప్రతి పక్ష నాయకులమీద తప్పుడు కేసులు పెడుతూ ప్రజాధనాన్ని దుర్వినియోగం చేస్తోంది ఈ జగన్ రెడ్డి అని ధ్వజమెత్తారు. నిజం గెలవడానికి ఆలస్యంక ఆవచ్చు కానీ కచ్చితంగా గెలుస్తుందని ఇప్పటికైనా సైకో జగన్ అర్థం చేసుకోవాలన్నారు. అక్రమ కేసులు పెట్టి వాటిని రాజకీయ ప్రయోజనాలకు

మిగతా 4లో..

## సుప్రీంకోర్టు తీర్పు జగన్‌కు చెంపపెట్టు లాంటిది

- మాజీమంత్రి పల్లె రఘునాథ్ రెడ్డి



మాజీమంత్రి పల్లె రఘునాథ్ రెడ్డి

**పుట్టపర్తిటౌన్, జనవరి 30, ప్రభాతవార్త**

చంద్రబాబుపై పెట్టిన అక్రమ కేసులను ఒక్కటైనా జగన్ ప్రభుత్వం నిరూపించలేకపోయిందని, మాజీ మంత్రి పల్లె రఘునాథ్ రెడ్డి ఎద్దేవా చేశారు. మంగళవారం పుట్టపర్తిలోని తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ, ఇన్నర్ రింగ్‌రోడ్డు కేసులో సుప్రీం కోర్టులో జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వానికి చుక్కెదురైందన్నారు. చంద్రబాబు ముందస్తు బేయిల్‌ను రద్దు చేయాలని ప్రభుత్వం వేసిన పిటిషన్‌ను సుప్రీం కోర్టు కొట్టివేసిందని, ఈ తీర్పు జగన్‌కు చెంపపెట్టు లాంటిందన్నారు. ప్రతిపక్ష నాయకులమీదతప్పుడు కేసులు బనాయించి ప్రజా ధనాన్ని ప్రభుత్వం దుర్వినియోగం చేస్తోందని, ఎప్పటికైనానిజమే గెలుస్తుందని, కోర్టులలో న్యాయం జరుగుతుందని నిరూపితమైందన్నారు. టిడిపి ఐదు కోట్ల మంది ప్రజలే స్టార్ క్యాంపేయినర్లన్నారు. ఇంటిలోని తల్లి,చెల్లిని మోసం చేసిన జగన్ చరిత్ర ప్రజలందరూ అర్థం చేసుకుంటున్నారని, ఎడాపెడా ధరలు పెంచిసామాన్యుల నడ్డీవిరుస్తున్నారన్నారు. 13 లక్షల కోట్లు అప్పులు చేసి రాష్ట్రాన్ని అప్పుల పాలు చేశాదని, వైసిపిపై అసంతృప్తితో రాష్ట్ర వ్యాప్తంగా పలువురు నేతలు ఆ పార్టీని వీడుతున్నారని, దీంతో జగన్‌కు ఓటమి భయం పట్టుకుందన్నారు. అందుకు నిదర్శనం చంద్రబాబు చేపట్టిన రా కదిలి రా కార్యక్రమానికి హాజరవుతున్న ప్రజలను చూసి ఆ పార్టీకి గుండెల్లో రైళ్ళు పరిగెడుతున్నాయన్నారు.

### వైకాపా వీడి తెదేపాలో చేరిక

పుట్టపర్తినియోజకవర్గ పరిధిలోని ఓడిసి మండలం నల్లగుట్టపల్లికి చెందిన 11 వైసిపి కుటుంబాలు మాజీమంత్రి పల్లె రఘునాథ్ రెడ్డి సమక్షంలో తెదేపాలోకి చేరారు. ఈ సందర్భంగా పల్లె వారికి కండువాలు వేసి సాదరంగా పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా పల్లె మాట్లాడుతూ, ఒక్కసారి అవకాశం ఇవ్వాలని ఎన్నికల్లో ప్రజలను ప్రాధేయపడినందు ప్రజలు జగన్‌కు అవకాశం ఇచ్చి మోసపోయారన్నారు. నియోజకవర్గ వ్యాప్తంగా ప్రజల్లో మార్పు స్పష్టంగా కనిపిస్తోందన్నారు. ఎలాంటి జీవో విడుదల కాకున్నా 193 చెరువులకు 864 కోట్లు మంజూరయ్యాయని స్థానిక ఎమ్మెల్యే పాదయాత్ర చేయడం హాస్యాస్పదంగా ఉందన్నారు. నియోజకవర్గంలో చెప్పుకోదగ్గ ఒక్క మంచి పని కూడా చేయలేదని, 2024 ఎన్నికల్లో తెదేపా గెలుపు ఖాయమన్నారు.

## భారత జాతికి స్వేచ్ఛా స్వాతంత్ర్యం అందించిన మహనీయుడుకి ఘన నివాళి

### - ఉమా మహేశ్వరనాయుడు

కళ్యాణదుర్గం టౌన్, జనవరి 30 ప్రభాతవార్త


గాంధీ చిత్రపటానికి నివాళులు అర్పిస్తున్న దృశ్యం

భారతజాతికి స్వేచ్ఛ స్వాతం త్ర ం అందించి భారత జాతికి జాతిపిత అయ్యాడు అని కళ్యాణదుర్గం నియోజకవర్గ టిడిపి ఇన్‌చార్జ్ మాదినేని ఉమా మహేశ్వరనాయుడు పేర్కొన్నారు. మంగళవారం నియోజకవర్గం ఎన్టీఆర్ భవనంలో మహాత్మా గాంధీకి వర్ధంతి సందర్భంగా చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. భారతదేశానికి స్వతంత్ర్యం సాధించిన వారిలో గాంధీ ప్రథములు అని అందుకే దేశ ప్రజలు గాంధీని జాతిపిత అని పిలుస్తారు అని తెలిపారు. అంతే క ఆదు సత్యము, అహింస గాంధీ నమ్మిన ఆయుధాలు అని ఇప్పుడు యువత గాంధీ మార్గంలో నడిచి దేశానికి సేవ చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## మహాత్మా గాంధీ అడుగుజాడల్లో నడుద్దాం..

కళ్యాణదుర్గం టౌన్, జనవరి 30 ప్రభాతవార్త


అన్నదానం చేస్తున్న దృశ్యం

ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో ఘనంగా జాతిపిత మహాత్మా గాంధీ వర్ధంతి వేడుకలు నిర్వహించారు. జాతిపిత మహాత్మా గాంధీ అడుగు జాడల్లో నడుద్దాం అని ఆర్యవైశ్య సంఘం అధ్యక్షులు జయం విశ్వనాథ్ అన్నారు. మహాత్మా గాంధీ వర్ధంతి వేడుకలు ఆర్యవైశ్య సంఘం అధ్యక్షులు జయం విశ్వనాథ్ ఆధ్వర్యంలో మంగళవారం ఘనంగా జరుపుకున్నారు. వర్ధంతి సందర్భంగా అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

## ఘనంగా గాంధీ 76వ వర్ధంతి

కళ్యాణదుర్గం టౌన్, జనవరి 30 ప్రభాతవార్త


నివాళులు అర్పిస్తున్న దృశ్యం

భారతదేశ స్వాతంత్ర్య సంగ్రామంను శాంతి, అసింహతో సాధించి జాతి పితగా మారిన మహాత్మ గాంధీ 76వ వర్ధంతి సందర్భంగా మంగళవారం కళ్యాణదుర్గంలోని బైపాస్ లోని మహాత్మా గాంధీ విగ్రహానికి పూలమాలలు వేసి శ్రద్ధాంజలి సమర్పించే కార్యక్రమం స్వాతంత్ర్య సమరయోధులు కళ్యానదు ర్గం మాజీ ఎమ్మెల్యే హిందీ నరసప్ప స్మారక సమితి వారు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా రాష్ట్ర ఉత్తమ సామాజిక సేవ అవార్డు గ్రహీత చల్లా కిషోర్ చౌదరి, ఆంగ్ల అధ్యాపకులు మల్లికార్జున, ఓబుళరాజు, జిల్లా వినియోగదదారుల సంఘాల సమాఖ్య గౌరవ అధ్యక్షులు చల్లా రాజశేఖర్‌చౌదరి, సీనియర్ జర్నలిస్టు లింగప్రసాద్, బిఎస్ఎన్ఎల్ నారాయణ, రోజ్లీ రాజేష్, వైసీపీ న ఆయకులు, గుప్తా టైలర్ శీను, సోమశేఖర్, మానవ హక్కుల మారుతీ ప్రసాద్, తప్పల్ బాబా, క రణం మల్లికార్జున బాబు, శీను, సెలిన చౌదరి తదితరులు పాల్గొని, అమర వీరుల సంస్కరణ దినోత్స వంగా గాంధీ వర్ధంతి నిర్వహించడం జరుగుతుంది అని వారి త్యాగాలను స్మరిస్తూ, వారి ఆశయాలు కొనసాగాలని కోరుతూ శ్రద్ధాంజలి ఘటించారు.

## గ్రామాల అభివృద్ధిని పట్టించుకోని జగన్ ప్రభుత్వం

### - మాజీ శాసనసభ్యుడు ఉన్నం హనుమంతరాయ చౌదరి

### - మహిళలు ఎదిగితేనే రాష్ట్రం అభివృద్ధి చెందుతుంది ఉన్నం వరలక్ష్మి

శెట్టూరు, జనవరి 30 ప్రభాతవార్త


బాబుషూరిటీ భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్న దృశ్యం

మండల పరిధి లోని చింతర్లపల్లి గ్రామంలో తెలుగు దేశం పార్టీ ప్రకటించిన బాబుషూరిటీ–భవిష్యత్తు గ్యారెంటీ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లే భాగంగా మాజీ శాసనసభ్యులు ఉన్నం హనుమంతరాయచౌదరి, కోడలు ఉన్నం వరలక్ష్మి, చీరలు పసుపు కుంకుమ పంచుతూ గ్రామసర్పంచు గౌరమ్మ అధ్యక్షతన టిడిపి నాయకులు విస్తృత ప్రచారం నిర్వహించారు. అనంతరం ఉన్నంవరలక్ష్మి ప్రతిఇంటింటికి తిరుగుతూ మనం చంద్రబాబునాయుడుని మళ్లీ ముఖ్యమంత్రి చేసుకోవాల్సిన ఆవశ్యకతను, అదే విధంగా సూపర్ సిక్స్ పథకాల ద్వారా వారికి అందే ప్రయోజనాలను తెలియజేశారు. తెలుగుదేశం పార్టీ అధికారంలోకి వస్తేనే గ్రామాల అభివృద్ధి చెందుతాయని, ఈ చేతకాని వైకాపా ప్రభుత్వం అభివృద్ధిని అక్రమాస్తులు కూడబెట్టేందుకు పనిచేస్తుందని టిడిపి రాష్ట్ర ఉపాధ్యక్షులు, మాజీ శాసనసభ్యులు ఉన్నం హనుమంతరాయచౌదరి విమర్శించారు. మహిళలు ఆర్థికంగాఎదిగితే రాష్ట్రం కూడా అభివృద్ధి పథంలో పయనిస్తుందని, అందుకు అనుగుణంగానే తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షులు నారా చంద్రబాబునాయుడు మహిళల అభ్యున్నతి కోసమే ఎన్నికల మేనిఫెస్టోలో మహాశక్తి పేరిట సూపర్ సిక్స్ పథకాలను తీసుకొచ్చారని ఉన్నం వరలక్ష్మి పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో శ్రీశైలం దేవస్థానంమాజీ ట్రస్టు బోర్డు సభ్యులు ఆర్.జి.శివకుమార్, మాజీ జడ్పిటిసి కవిత, మాజీ ఎంపిపి శాంతమ్మ, మాజీ ఎంపిటిసి జయమ్మ, మాజీ మండల కన్వీనర్ గురుప్రసాద్, మాజీ మండల కన్వీనర్ తిప్పేస్వామి, చెన్నకేశవ, మాజీ మండల ప్రధాన కార్యదర్శి రంగప్ప, కంబాలపల్లి చిత్తప్ప, బొజ్జప్పమోహన్, అంగడి చెన్న కేశవ, నాగభూషణ, సంజీవ, తిప్పయ్య, పెద్ద మారెప్ప, గంగాధర్, మధు, రుదేశ్, మహిళలు ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## పనులను పరిశీలిస్తున్న సర్పంచు

శెట్టూరు, జనవరి 30 ప్రభాతవార్త


పనులను పరిశీలిస్తున్న సర్పంచు

మండలంలోని ఐదుకల్లు గ్రామపంచాయితీలో స్థానిక సర్పంచు విరుపాక్షి గౌడ్ ఎన్నో సంవత్సరాల నుంచి ప్రధాన రహదారి గుండా వర్షపు నీరు కావచ్చు మురికి నీరు కావచ్చు, ప్రధాన రోడ్డుపైనే నిల్వ ఉంచి రోడ్డు మ ఈద వాహనదారులకు, చుట్టుపక్కల ఉన్న ప్రజలకు చాలా ఇబ్బందిగా ఉండేది దీని గమనించిన సర్పంచు వెంటనే పరిష్కారం మార్గం వెతికి డ్రైనేజీ వ్యవస్థ దీనికి వెంటనే అక్కడ పనులను ప్రారంభించి పూర్తి చేశారు. ఇప్పుడు అక్కడ ఎటువంటి ఇబ్బంది లేకుండా నీరు డ్రైనేజీ ఉంటా ముందుకు వెళ్తుంది. ఎక్కడ కూడా నిలువలేదు. ఇంత మంచి కార్యక్రమాన్ని చేపట్టిన సర్పంచ్ విరుపాక్షిగౌడ్‌ను పంచాయితీ ప్రజలు అభినందించారు.

## ఘనంగా గాంధి వర్ధంతి వేడుకలు...

రాయదుర్గం, జనవరి 30 ప్రభాతవార్త:


గాంధి చిత్రపటానికి నివాళులు అర్పిస్తున్న తెదేపా నాయకులు

స్థానికతెలుగుదేశంపార్టీ కార్యాలయంలో జాతిపిత మహాత్మాగాంధీ 76వ వర్ధంతి సందర్భంగా తెదేపా శ్రేణులు ఘన నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా పట్టణ అధ్యక్షుడు పసుపులేటి నాగరాజు మాట్లాడుతూ మహాత్మాగాంధీ బ్రిటిష్ వారిపై స్వాతంత్ర ఉద్యమంలో అహింస వాదంతో భారత దేశానికి స్వాతంత్ర్యం తెచ్చారన్నారు. స్వాతంత్ర్యం కోసం శాంతియుతంగా ఎన్నో పోరాటాలు చేశారన్నారు. అందరూ మహాత్మాగాంధీ మార్గంలో నడవాలని పిలుపునిచ్చారు. ముందుగా తెలుగుదేశం నాయకులతో కలిసి గాంధీ చిత్రపటానికి పూలమాలలువేసి ఘనంగా నివాళులుఅర్పించారు. ఈ కార్యక్రమంలో మాజీ మున్సిపల్ వైస్ ఛైర్మెన్ కడ్డిపుడి మహబూబ్‌బాషా, మాజీ కౌన్సిలర్ సిద్దప్ప, సీనియర్‌నాయకులు తిప్పేస్వామి, ఎస్సీ సెల్‌జిల్లా ఉపాధ్యక్షులు మల్లికార్జున, వై.వెంకటేశులు, దాసరి సత్తి, ఆటో మల్లేష్, ఆటో వెంకటేష్, ఆర్‌బి వంకకృష్ణప్ప, కల్యంతిప్పేస్వామి, విజయ్‌కుమార్, ప్రహల్లాద, భజంత్రీ కృష్ణ, తదితర తెదేపా నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## నూతన ఎస్సైకి ఘన సన్మానం...

బొమ్మనహాళ్, జనవరి 30 ప్రభాతవార్త:


ఎస్సైని సన్మానిస్తున్న దృశ్యం

బొమ్మనహాళ్ పోలీస్‌స్టేషన్లో నూతనంగా బాధ్యతలు చేపట్టిన ఎస్సై వి.శ్రీనివాసులును మంగళవారం బొమ్మనహాళ్ మండల వైకాపా యూత్ నాయకులు హరేసముద్రం రాముడు ఆధ్వర్యంలో పూలమాలలు, దుశాలువాలతో ఘనంగా సన్మానించారు. మండలంలో శాంతిభద్రతలకు విఘాతం కలగకుండా సహకరించాలని ఎస్సై వారికి సూచించారు. గ్రామాల్లో ఎలాంటి సంఘటనలు జరిగినా తమకు సమాచారం ఇవ్వాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో వైకాపా యూత్ సభ్యులు నేమకల్లు ఆంజి, గోవిందవాడ సుధాకర్, బొల్లనగుడ్డం సుదర్శన్, దేవగిరి రమేష్, కురువల్లి అనిల్ తదితరులు పాల్గొన్నారు.

## విశాఖ డిపిటిఓ పై చర్యలు తీసుకోవాలి....ఎన్‌ఎంయు ఆందోళన

రాయదుర్గం, జనవరి 30 ప్రభాతవార్త:


నిరసన తెలుపుతున్న ఎన్‌ఎంయూ నాయకులు..

ఏపిఎస్ ఆర్టీసి సంస్థకు నష్టం కలిగించే విధంగా షెడ్యూలు, బదలీలు మార్పులు చేర్పులు చేసిన విశాఖ డిపిటిఓ మీద చర్యలు తీసు కోవాలని కోరుతూ ఏపిఎస్ ఆర్టీసి ఎన్‌ఎంయు యూనియన్ సభ్యులు మంగళవారం రాయదుర్గం ఆర్టీసి డిపో ముందు నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా యూనియన్ నాయకులు మాట్లాడుతూ అన్యాయంగా ఎన్‌ఎంయు నాయకులను పోలీస్ స్టేషన్లో నిర్బంధించటకు కారణమైన డిపిటిఓ చర్యలను తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. అన్ని యూనిట్లలో 6,12,18,24,30 ఏఎస్‌లను ఏపిఎస్ ఆర్టీసి నిబంధనల ప్రకారం అమలు చేయాలన్నారు. రాష్ట్రంలో అనేక చోట్ల చేస్తున్న విధంగా కౌన్సిలింగ్ పద్దతిలో కండక్టర్, డ్రైవర్ డ్యూటి చార్టులను వేయాలని, అన్ని మెడికల్ సర్టిఫికెట్లకు జీతాలు చెల్లించాలన్నారు. ఇప్పటికైనా విశాఖ డిపిటిఓ ఉద్యోగులపై కక్ష సాధింపు చర్యలు మానుకోవాని వారు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో నేషనల్ మజ్దూర్ యూనిటి అసోషియేషన్ రాష్ట్ర అసిస్టెంట్ సెక్రెటరి ఎస్ నాగరాజు, రీజనల్ వైస్ ప్రెసిడెంట్ దామోదర్, రీజనల్ ఆర్గనైజ్ సెక్రెటరి రవికుమార్‌నాయక్, డిపో అధ్యక్షులు టిఎస్‌కె జిలాన్, డిపో కార్యదర్శి తిప్పేస్వామి, గ్యారేజ్ కార్యదర్శి సతీష్‌కుమార్, ప్రచార కార్యదర్శి జిఎం.నాఫీస్, బీపిరెడ్డి, ఎర్రిస్వామి, అనిల్‌కుమార్ రాజు, సూరిబాబు, నారాయణ, మస్తాన్, వన్నూరుస్వామి, ఆంజినేయులు, వెంకటేశులు, గోపికృష్ణ తదితర ఉద్యోగులు, నాయకులు పాల్గొన్నారు.

## మున్సిపల్ కమీషనర్‌గా షేక్ మాలిక్...

రాయదుర్గం, జనవరి 30 ప్రభాతవార్త:


బాధ్యతలు చేపడుతున్న మున్సిపల్ కమీషనర్ షేక్ మాలిక్

రాయదుర్గం మున్సిపల్ కమీషనర్‌గా షేక్ మాలిక్ మంగళవారం బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ కమీషనర్‌గా విధులు నిర్వర్తిస్తున్న దివాకర్‌రెడ్డి బదిలీ కావడంతో ఆ స్థానంలో షేక్‌మాలిక్ బదిలీపై ఇక్కడకు చేరుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పట్టణంలో వార్డుల్లో నెలకొన్న సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించి, ప్రజలకు అందుబాటులో ఉంటానని ఆయన పేర్కొన్నారు. వార్డుల్లో ఏమైనా సమస్యలు ఉంటే తమ దృష్టికి తీసుకురావాలన్నారు. పురపాలక సంఘ అభివృద్ధి తమ వంతు సహాయ సహకారాలు అందిస్తామన్నారు.

## సీఐ, ఎస్సైని సన్మానించిన సర్పంచ్....

కణేకల్లు, జనవరి 30 ప్రభాతవార్త:


సీఐ, ఎస్సైలను సన్మానిస్తున్న సర్పంచ్...

ప ట్ట ణ ం లో ని పోలీస్‌స్టేష న్లో నూతనంగా బాధ్యతలు స్వీకరించిన రాయదుర్గం రూరల్ సీఐ ప్రసాద్‌బాబు మరియు కణేకల్లు ఎస్సై శ్రీనివాసులను మండల పరిధిలోని ఎర్రగుంట గ్రామ సర్పంచ్ వన్నూరమ్మ హనుమంతు దంపతులు మంగళవారం స్థానిక పోలీస్‌స్టేషన్లో మర్యాద పూర్వకంగా కలిసి పూలమాలలు, దుశాలువాతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా మండలంలో శాంతిభద్రతలను పరిరక్షించాలని, అసాంఘిక కార్యకలాపాలను అరికట్టాలని, గొడవలు, కర్ణాటక మద్యంపై కఠిన చర్యలు తీసుకోవాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో వైకాపా ఫీల్డ్ అసిస్టెంట్ ఎస్.యన్నప్ప, ఎస్.నింగప్ప, వంద్రయ్య, తిరుపతయ్య తదితరులు పాల్గొన్నారు.

## మహాత్మగాంధీకి ఘన నివాళి అర్పించిన డాక్టర్ రాజేష్‌కుమార్

బ్రహ్మసముద్రం జనవరి 30 ప్రభాతవార్త,


మహాత్మగాంధీ చిత్రఫటానికి పూలమాల వేస్తున్న దృశ్యం

మండల కేంద్రంలోని ప్రజా వైద్యశాలలో డాక్టర్ రాజేష్‌కుమార్ మహాత్మ గాంధీ జయంతి సందర్భంగా చిత్రఫటానికి పూల మాలవేసి ఘనంగా నివాళులు అర్పించారు. అనంతరం డాక్టర్ మాట్లాడుతూ గాంధీజి మన భారతదేశానికి స్వాతంత్రం కోసం చేసిన పోరాటాలు ప్రజలు మరువలేనివని గాంధీజి కలలు కన్న స్వరాజ్యం మన అందరి భాధ్యత అనిఅన్నారు. ఈ కార్యక్రమంలో ఫార్మాసిస్టు మహేష్,ల్యాబ్ టెక్నీషియన్ పవన్‌కుమార్,స్టాఫ్‌నర్స్ భారతి సిబ్బంది పాల్గొన్నారు.

## ఎల్ఆర్‌జి విద్యార్థినికి అవార్డు

హిందూపురం టౌన్, జనవరి 30 ప్రభాతవార్త


అవార్డు అందుకుంటున్న విద్యార్థిని

హిందూపురం రూరల్ కిరికెరలోని ఎల్ఆర్‌జి పాఠశాల విద్యార్థిని దీక్షిత వ్యాసరచన పోటీల్లో రాష్ట్రస్థాయిలో ప్రథమ అవార్డు అందుకుంది. ప్రభుత్వం నిర్వహించిన వీరగాథ 3.0లో భాగంగా వ్యాసరచన పోటీల్లో విద్యార్థిని దీక్షిత పాల్గొని ప్రతిభ కనబరిచింది. ఈ మేరకు విజయవాడలో జరిగిన కార్యక్రమంలో పాఠశాల విద్యా కమీషనర్ సురేష్‌కుమార్, సమగ్ర శిక్షణ రాష్ట్ర అడిషనల్ ప్రాజెక్ట్ డైరెక్టర్ శ్రీనివాసరావుల చేతుల మీదుగా అవార్డును అందుకుంది. అదేవిధంగా విద్యార్థి ప్రతిభ కనబరిచినందుకు 5 వేల రూపాయల నగదును బహుమతి అందచేశారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ప్రసాద్, కార్యదర్శి బాలసుందరం, ఎ.ఐ సంజీవరెడ్డి, ఉపాధ్యాయలు విద్యార్థిని అభినందించారు.

## మహాత్ముడు కలలుగన్న గ్రామ స్వరాజ్యం సాకారం

హిందూపురం టౌన్, జనవరి 30 ప్రభాతవార్త


గాంధీ చిత్రపటం వద్ద నివాళులు అర్పిస్తున్న దీపిక

మహాత్ముడు కలలుగన్న గ్రామ స్వరాజ్యాన్ని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్రంలో సాకారం చేశారని వైసిపి హిందూపురం నియోజకవర్గం సమన్వయకర్త దీపిక పేర్కొన్నారు. గాంధీ వర్ధంతి సందర్భంగా మంగళవారం వైసిపి పార్టీ కార్యాలయంలో గాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అహింసా, సత్యాగ్రహాలే ఆయుధాలుగా అఖండ భారతావనికి స్వేచ్ఛ స్వాతంత్ర్యాలు సంపాదించిన మహా నాయకుడు సమస్త విశ్వానికి శాంతి సందేశం ప్రభోదించిన మన జాతిపిత మహాత్మాగాంధీని ప్రతి ఒక్కరు ఆదర్శంగా తీసుకోవాలని ఆమె పేర్కొన్నారు. ఈ కార్య క్రమంలో వైసిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. అదేవిధంగా మున్సిపల్ కార్యాలయంలో మున్సిపల్ కమీషనర్ ప్రమోద్‌కుమార్, మున్సిపల్‌చైర్‌పర్సన్ ఇంద్రజ, మున్సిపల్‌చైర్మన్ బలరామిరెడ్డి, తదితరులు గాంధీజీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు.

## పలువురు కాంగ్రెస్ పార్టీలో చేరిక

హిందూపురం టౌన్, జనవరి 30 ప్రభాతవార్త


కాంగ్రెస్ పార్టీలో చేరిన దృశ్యం

ప ట్ట ణ ం లో ని త్యాగరాజనగర్, శాంతి నగర్ ప్రాంతానికి చెందిన 10 కుటుంబాలు మంగళవారం కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర కార్యదర్శి బాలాజీమనోహార్ నేతృత్వంలో కాంగ్రెస్ పార్టీలో చేరినట్లు తెలిపారు. పార్టీలో చేరిన వారికి ఆయన కండువా వేసి ఆహ్వానించారు. ఈ సందర్భంగా బాలాజీమనోహార్ మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్‌లో ఏపి పిసిసి అధ్యక్షురాలు వైఎస్ షర్మిల నేతృత్వంలో కాంగ్రెస్‌పార్టీకి పూర్వవైభవంవస్తుందని ఆయన తెలియచేశారు.

## వైఎస్ఆర్ బీమా అందజేత

లేపాక్షి, జనవరి 30 ప్రభాతవార్త


వైఎస్ఆర్ బీమా అందచేస్తున్న దృశ్యం

మండలంలోని చోళసముద్రం గ్రామంలోని ఎస్‌సి కాలనీకి చెందిన మృతురాలు రాధమ్మ కుటుంబానికి వైఎస్ఆర్ బీమా కింద మంజూరైన పది వేల రూపాయలను వైకాపా కన్వీనర్ నారాయణ స్వామి బాధిత కుటుంబసభ్యులకు అందచేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన తరువాత వైఎస్ఆర్ బీమా పథకాన్ని ప్రతిష్టాత్మకంగా అమలు చేయడం జరుగుతోందన్నారు. రాష్ట్రంలో ఎవరు మృతి చెందిన వైఎస్ఆర్ బీమాపథకాన్ని అమలుచేసి ఆకుటుంబానికి చేదోడు వాదోడుగా ముఖ్యమంత్రి వున్నారని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కోడిపల్లి సర్పంచు మంజునాథ్, వెల్ఫేర్ అసిస్టెంట్ మహేంద్ర, తదితరులు పాల్గొన్నారు.

## క్రీడల్లో రాణించిన టేకులోడు గురుకుల విద్యార్థినిలు

చిలమత్తూరు, జనవరి 30 ప్రభాతవార్త

రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న ఆడుందా ఆంధ్ర కార్యక్రమంలో భాగంగా ఎంఇఎం గ్రౌండ్స్‌లో నిర్వహించిన ఆటల పోటీల్లో మండలంలోని టేకులోడు గురుకుల పాఠశాల విద్యార్థినిలు తమ సత్తా చాటినట్లు కళాశాల ప్రిన్సిపాల్ శ్యాంభూపాల్‌రెడ్డి తెలిపారు. ఇందులో భాగంగా క్రికెట్, కబడ్డీ, ఖోఖోలో నియోజకవర్గం స్థాయిలో ప్రథమ స్థానాన్ని అధిరోహించి ఒక్కొక్క ఆటలో 35 వేల రూపాయల పారితోషికాన్ని సాధించడంతో పాటు వాలీబాల్ పోటీల్లో తృతీయ స్థానంలో నిలిచి 5 వేల రూపాయలను కైవశం చేసుకున్నారన్నారు. విజేతలుగా నిలిచి నాలుగు ఆటల్లో 1,10,000 రూపాయల పారితోషికంతో నియోజకవర్గం స్థాయిలో విజయకేతనాన్ని ఎగురవేశారన్నారు. ప్రతిభ చూపిన విద్యార్థినిలను ప్రిన్సిపాల్‌తో పాటు వైస్‌ప్రిన్సిపాల్ రమణారెడ్డి, పిఇటిలు రాజమ్మ, గీత, సిబ్బంది అభినందించారు. గెలుపొందిన విద్యార్థులు జిల్లా స్థాయిలో కూడా మరింత ప్రతిభ కనబరిచేందుకు తగిన శిక్షణ ఇస్తున్నట్లు వారు తెలిపారు.

## రిజర్వ్ బ్యాంకు గురించి అవగాహన

బెలుగుప్ప, జనవరి 30 ప్రభాతవార్త


విద్యార్థులకు ఆర్‌బిఐ గురించి సలహాలు సూచనలు అందజేస్తున్న అధికారులు

మండలకేంద్రంలో కస్తూర్బా గాంధీ పాఠశాలలో మంగళవారం హైదరాబాద్‌కు చెందిన రిజర్వ్ బ్యాంక్ అసిస్టెంట్ మేనేజర్ నాగరాజు, అనంతపురం జిల్లాకు చెందిన లీడ్ బ్యాంక్ మేనేజర్ సత్యరాజు విద్యార్థులతో ఆర్‌బిఐ గురించి సలహాలు,సూచనలు అందించారు. ఈసందర్భంగా అధికారులు మాట్లాడుతూ.. రిజర్వ్ బ్యాంకు గురించి సంవత్సరంలో ఆర్థిక లావాదేవీల గురించి ఆఫ్‌లైన్ గురించి ఏదైనా ఒక నోట్‌ను ముద్రించడానికి రూ.ఖర్చు అవుతుందని, ఆన్‌లైన్ అయితే రూపాయి కూడా చెల్లించనవసరం లేదని విద్యార్థులకు తెలియజేశారు. ఆంధ్రప్రదేశ్‌లో అన్ని బ్యాంకులు ఆర్‌బిఐకి అనుసంధానం ఉంటుందని తె లిపారు. ఈ బ్యాంకు గురించి క్విజ్ పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో గెలుపొందిన వారికి బహుమతులు అందజేశారు. ఆ పాఠశాలకు చెందిన విద్యార్థులకు ప్రతి ఒక్కరికీ ఒక పెన్, స్కేల్, నోట్ పుస్తకం అందజేశారు. ఈ కార్యక్రమంలో లీడ్ బ్యాంక్ అసిస్టెంట్ మేనేజర్ హరినాథ్‌రెడ్డి, స్పెషల్ ఆఫీసర్ నాగరత్న భాయి, ఉపాధ్యాయురాలి బృందం పాల్గొన్నారు.

## కొత్త మార్కెట్ షెడ్ల ఏర్పాటులో అక్రమాలు

### - వేలం వేయాలని టిడిపి డిమాండ్

హిందూపురం, జనవరి 30 ప్రభాతవార్త


ప్రశ్నిస్తున్న టిడిపి కౌన్సిలర్ రమేష్

మున్సిపల్ నూతన మార్కెట్ అనుబంధంగా పరిగి బస్టాండ్ ప్రాంతంలో హోల్‌సేల్ వెజిటబుల్ మార్కెట్ స్థల విస్తీర్ణం కేటాయింపులో అక్రమాలు జరుగుతున్నాయని వారి వద్ద కలెక్ట్ చేసిన డిపాజిట్లు ఏమి అయ్యాయని టిడిపి కౌన్సిల్ విపక్షనేత రమేష్‌కుమార్, ఆ పార్టీ కౌన్సిలర్లు ప్రశ్నించారు. స్థానిక మున్సిపల్ కార్యాలయంలో మంగళవారం కౌన్సిల్ సమావేశం ఆలస్యంగా ప్రారంభమైంది. అంతకుముందే చైర్‌పర్సన్ చాంబర్‌లో అధికార వైసిపి కౌన్సిలర్ల మధ్య తాజా విభేదాల విషయం సుదీర్ఘంగా చర్చించినప్పటికి ఏకాభిప్రాయం కుదరలేదు. ఆ తరువాత కౌన్సిల్ సమావేశం ప్రారంభమైన వెంటనే టిడిపికి చెందిన రమేష్ మాట్లాడుతూ పరిగి బస్టాండ్‌లో షాపుల కేటాయింపు వేలం నిర్వహించాలని చెబుతుండగానే కౌన్సిల్‌లో వాగ్వాదాలు ప్రారంభమయ్యాయి. అధికార పార్టీకి చెందిన కౌన్సిలర్లు సమావేశం జరగకుండా అడ్డు తగులుతూ తమ పార్టీకి చెందిన కొందరు కౌన్సిలర్ల వార్డుల్లో అభివృద్ధి పనులు చాలా జరిగాయని, అయితే తమ వార్డుల్లో మాత్రం పనులు జరగడం లేదని ఆరోపిసూస్త బైటాయించారు. గందరగోళం నెలకొనడంతో చైర్‌పర్సన్ ఇంద్రజ సమావేశాన్ని వచ్చే నెల 7వతేదీకి వాయిదా వేసినట్లు ప్రకటించారు. ఇదిలా వుండగా అధికార వైసిపికి చెందిన కౌన్సిలర్లు రెండు గ్రూపులుగా చీలిపోయి ఆధిపత్యం కోసం ఎత్తుకు పై ఎత్తులు వేస్తున్నారని అదే పార్టీకి చెందిన పలువురు కౌన్సిలర్లు పేర్కొంటున్నారు.

## తీరనున్న తాగునీటి సమస్య

చిలమత్తూరు, జనవరి 30 ప్రభాతవార్త


బోరు వేస్తున్న దృశ్యం

హిందూపురం వైసిపి ఇన్‌చార్జ్ దీపిక ఆదేశాల మేరకు మండలంలోని కోడూరు పంచాయతీలో ఎంపిపి పురుషోత్తంరెడ్డి మండల పరిషత్ నిధులతో బోరు వేయించారు. బోరులో నీరు పుష్కలంగా పడడంతో గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు. కోడూరు సర్పంచు మురళీమోహన్ మాట్లాడుతూ ఇక తాగునీటి సమస్య తీరుందని పేర్కొన్నారు. ఈ కార్య క్రమంలో ఎంపిటిసి మంజునాథ్, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

## కరువు ఉపాధి పనులపై సామాజిక తనిఖీ

బెలుగుప్ప, జనవరి 30 ప్రభాతవార్త

మండల కేంద్రంలో మండల పరిషత్ కార్యాలయంలో 01-04-2022 నుంచి 31-3-2023 వరకు చేసిన కరువు ఉపాధి పనులపై సామాజిక తనిఖీ నిర్వహిస్తామని ప్రజా వేదికలో సంబంధించిన 19 గ్రామాలకుచెందిన ప్రజలు రావాలని మండల పరిషత్ అధికారి జిఎస్.రామచంద్ర తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మండలంలో ప్రజా ప్రతినిధులు, అందరూ హాజరు కావాలని తెలిపారు.

## ఉత్తమ సేవ పురస్కారం పొందిన ఎంవిఐ ప్రసాద్‌కు సన్మానం

ధర్మవరం, జనవరి 30 ప్రభాతవార్త


ఎంవిఐ ప్రసాద్‌కు సన్మానం చేస్తున్న దృశ్యం

డ్రైవింగ్ స్కూల్స్ ఆధ్వర్యంలో ఉత్తమ సేవ పురస్కారం పొంది న ఎంవిఐ ప్రసాద్‌కు సన్మానం చేయడం జరిగింది. ఈ సందర్భం గాపట్టణంలో లక్ష్మి చె న్నకేశవపురంలో ఏర్పాటు చేసిన డ్రైవింగ్ స్కూల్, డ్రైవర్లను ఉద్దేశించి ఆయన మాట్లాడుతూ.. డ్రైవింగ్ చేసే వ్యక్తికి డ్రైవింగ్ లైసెన్స్ తప్పనిసరిగా పాటిస్తూ ప్రమాదాల నివారణలో డ్రైవర్లు కీలక పాత్ర పోషించాలని ఎంవిఐ వరప్రసాద్ తెలిపారు.రహదారి సూచనలు పాటిస్తూ ప్రయాణంలో డ్రైవర్లుసీట్ బెల్ట్ ధరించి సెల్ ఫోన్ మాట్లాడకుండా మద్యం సేవించకుండా డ్రైవింగ్ చేస్తే ప్రమాదాలను అరికట్టవచ్చని ప్రయాణికులను కూడా సురక్షిత ప్రాంతాలకు చేర్చివచ్చునని మీ రాకకై ఎదురుచూస్తున్న మీ భార్య పిల్లల దగ్గరికి సురక్షితంగా చేరుకునే అవకాశం ఉంటుందని ఆయన తెలిపారు.

**ఆర్టీఓ కార్యాలయానికి స్థల పరిశీలన :** పట్టణం దిన దిన అభివృద్ధి కావడంతో జనాభాని దృష్టిలో ఉంచుకొని ధర్మవరం పట్టణంలో స్థానికంగా ఆర్టీఓ కార్యాలయాన్ని ఏర్పాటు చేసేందుకు ధర్మవరం ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి ఆర్టీఓ అధికారులతో కలిసి పట్టణంలో మార్కెట్ యార్డ్‌లో స్థల పరిశీలన చేశారు. ఈ కార్యక్రమంలో ఆర్టీఓ, ఎంవిఐ వరప్రసాద్, జిల్లా అధికార ప్రతినిధి గుర్రం శ్రీనివాసులు రవీందర్‌రెడ్డి చందు పాల్గొన్నారు.

## ఉత్తమ అవార్డు గ్రహీత మండల విద్యాధికారికి ఘన సత్కారం

కంబదూరు,జనవరి 30,ప్రభాతవార్త:


ఘనంగా సన్మానం చేస్తున్న దృశ్యం

గణతంత్ర దినోత్సవం పురస్కరించుకోని కలెక్టర్ చేతుల మీదుగా ఉత్తమ అవార్డు పురస్కారం అందుకున్న కంబదూరు మండల విద్యాధికారి మదన్ మోహన్‌ను మరియు విజయ కుమారి ఎంఈఓలను 98 ఎంటిఎస్ ఉపీధ్యాయులు,ఇతర ఉపాధ్యాయ సంఘాల నాయకులు మంగళవారం ఘనంగా సత్కరించారు.ఈ సందర్భంగా పలువురు ఉపాధ్యాయులు మాట్లాడుతూ అయన సేవలను కోనియాడారు.ఈ కార్యక్రమంలో ఎంటిఎస్ ఉపాధ్యాయులు హనుమంతరాయుడు,నాగరాజు, గోవిందప్ప, సుబ్బారెడ్డి, ఓబులేశు,సుబ్బారెడ్డి,లింగమయ్య,శివ,గోవిందప్ప,రామేశ్వరి, నారాయణ స్వామి, మల్లేశప్ప,ఉపాధ్యాయ సంఘ నాయకులు తిప్పేస్వామి, నారాయణ, అక్కులప్ప, జయలక్ష్మి,రాజేశ్వరి,జిలాన్,లాలెప్ప,మర్రి స్వామి,సుధాకర్,రామాంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

## అదుపు తప్పిన లారీ


అదుపు తప్పిన లారీ దృశ్యం

కంబదూరు, జనవరి 30,ప్రభాతవార్త: మండలంలోని అండేపల్లి గ్రామం ప్రధాన రహదారి సమీపంలో సోమవారం రాత్రి లారీ అదుపు తప్పి రోడ్డు కింద ఉన్న కాలువలోకి దూసుకెళ్లింది. డ్రైవర్ నిద్ర మత్తు కారణంగానే ఘటన జరిగినట్లు తెలుస్తుంది.ఎటువంటి ప్రమాధం జరుగక పోవడంతో డ్రైవర్ ఊపిరి పిల్చుకున్నాడు.అయితే చెరువు కట్ట కింద ఉన్న ప్రధాన రహదారికి ఇరువైపులా చేట్లు పేరగడంతో ఎదురుగా వచ్చే వాహనాలు కనపడక పోవడం వల్ల ప్రమాదాలు జరుగుతున్నాయని ప్రయాణికులు వాపోతున్నారు.అధికారులు రోడ్డుకు ఇరువైపులా ఉన్న చెట్లను తొలగించి హెచ్చరికా బోర్డులను ఏర్పాటు చేయాలని ప్రయాణికులు కోరుతున్నారు.

# ఏ ఒక్క విద్యార్థి కూడా ఫెయిల్ అవ్వకూడదు

## చదువులో వెనుకబడిన పదో తరగతి విద్యార్థులపై దృష్టి పెట్టండి - వచ్చే విద్యాసంవత్సరంలో మంజూరైన వంద అడ్మిషన్లను భర్తీ చేయండి - ఎస్సీ హాస్టల్ వార్డెన్లకు జేడీ మదుసూధన్‌రావు ఆదేశం

అనంతపురం న్యూటౌన్, జనవరి 30 ప్రభాతవార్త

నగరంలోని సిపివో ఆఫీసులో మంగళవారం జిల్లాలోని ఎస్సీ హాస్టల్ వార్డెన్లతో జేడీ మదుసూధన్‌రావు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జేడీ మాట్లాడుతూ...మార్చి 18 నుంచి పదో తరగతి పరీక్షలు జరగుతున్నాయని, ఈ పరీక్షల్లో హాస్టల్లోని ఏ ఒక్క పదో తరగతి విద్యార్థి ఫెయిల్ అవ్వకూడదని, చదువులో వెనుకబడిన పదో తరగతి విద్యార్థులపై వార్డెన్లు ప్రత్యేక దృష్టి పెట్టాలని ఆదేశించారు. పదో తరగతి విద్యార్థులు పాస్ అవ్వడానికి ట్యూటర్లను కూడా ఏర్పాటు చేశామని, స్లిప్ టెస్టులు కూడా నిర్వహిస్తున్నామని, వార్డెన్లు కూడా విద్యార్థులను పక్కన కూర్చోబెట్టుకోని చదివించాలన్నారు. ప్రతి రోజు విద్యార్థులతో సొంతంగా ప్రాక్టీస్ చేయిస్తేనే ఫలితం ఉంటుందన్నారు. పరీక్షల్లో పాస్ కావాలనే తపన విద్యార్థుల్లో ఉండాలని, అందుకు వార్డెన్లు కూడా ప్రత్యేక శ్రద్ధ పెట్టాలన్నారు. పదో తరగతి, ఇంటర్ విద్యార్థులు పాస్ అయిన తర్వాత వారంతా ఏ ఏ కళాశాల్లో చేరారో అన్న వివరాలను కూడా వార్డెన్లు సేకరించాలన్నారు. ఏ ఒక్కరు కూడా డ్రాపౌట్ కాకూడదన్నారు. పదో తరగతి, ఇంటర్ పరీక్షల్లో విద్యార్థులు ఫెయిల్ అయితే సంబంధిత వార్డెన్లకు వేసవి సెలవులు ఉండదని, ఫెయిల్ అయిన విద్యార్థులను సెలవుల్లో బాగా చదివించి సప్లిమెంటరీ పరీక్షల్లో పాస్ అయ్యేలా వార్డెన్లు చర్యలు తీసుకోవాలన్నారు. ఇప్పటి నుంచి ప్రతి రోజు ఉదయం, సాయంత్రం వార్డెన్లు హాస్టల్‌కు వెళ్ళారా ? లేదా?, మెనూ అమలు చేశారా ? లేదా? అని వివరాలు సేకరిస్తు న్నామన్నారు. వచ్చే 2024-25 విద్యాసంవత్సరంలో ప్రతి హాస్టల్ కు మంజూరైన వంద అడ్మిషన్లను భర్తీ చేయాల్సిన బాధ్యత వార్డెన్లదే నన్నారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారంగా స్థానిక



జేడీని సన్మానిస్తున్న ఏఎస్‌డబ్ల్యూవోలు, వార్డెన్లు

విద్యార్థులకు హాస్టల్లో అడ్మిషన్లు ఇవ్వకూడదని, వార్డెన్లు దూర ప్రాంతాలకు వెళ్ళి హాస్టల్లో విద్యార్థులకు కల్పిస్తున్న సౌకర్యాలపై ప్రచారం చేసి అడ్మిషన్లను వంద శాతం భర్తీ చేసుకోవాలన్నారు. అందువలన అడ్మిషన్ల గురించి ఇప్పటి నుంచే ప్లాన్ చేసుకోవాలన్నారు. అనంతరం ఈనెల 26న రిపబ్లిక్ డే జిల్లా స్థాయి వేడుక ల్లో జిల్లా కలెక్టర్ చేతులు మీదుగా ఉత్తమ అధికారిగా అవార్డు అందుకున్న జేడీని ఏఎస్‌డబ్ల్యూవోలు, వార్డెన్లు ఘనంగా సన్మానించారు. అలాగే పెద్దవడ గూరు వార్డెన్ అవార్డు అందుకున్నందుకు ఆమెను జేడీ, ఏఎస్ డబ్ల్యూవోలు, వార్డెన్లు సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఏఎస్‌డబ్ల్యూవోలు రామ్మోహన్, ఫక్కీరప్ప, దామోదర్‌రెడ్డి, వార్డెన్లు, జిల్లా కార్యాలయం సిబ్బంది పాల్గొన్నారు.

# పచ్చదనం పరిశుభ్రత ప్రగతికి సోపానాలు

## - డిప్యూటీ మేయర్ కొగటం విజయభాస్కర్‌రెడ్డి



మొక్కలు నాటుతున్న దృశ్యం

అనంతపురం న్యూటౌన్, జనవరి 30 ప్రభాతవార్త

అనంతపురం రూరల్ పరిధిలో ఉన్న గ్రామంలో ప్రభుత్వ ఆర్ట్స్ కళాశాల ఎన్ఎస్ఎస్ యూనిట్-2 వాలెంటీర్లు నిర్వహిస్తున్న స్పెషల్ క్యాంప్‌లో భాగంగా ఆరవ రోజు మొక్కలు నాటడం కార్యక్రమాన్ని ముఖ్య అతిథులుగా అనంతపురం డిప్యూటీమేయర్ కొగటం విజయ భాస్కర్‌రెడ్డి, గ్రామ సర్పంచు, సెక్రటరీ, ఆర్ట్స్ కళాశాల ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్ విష్ణు ప్రియ, ఎస్సార్ ఎడ్యుకేషనల్ సొసైటీ వ్యవస్థాపకుల సుంకర రమేష్, నెహ్రూ యువ కేంద్ర ప్రోగ్రామ్ ఇన్‌చార్జ్ శ్రీనివాసులు రాష్ట్రపతి అవార్డు గ్రహీత జీవన్‌కుమార్, సోషల్ వెల్ఫేర్ ప్రిన్సిపాల్ సుశీల, మాజీ జడ్పిటిసి కిరణ్‌కుమార్‌రెడ్డి హాజరై ఈ కార్యక్రమం లో 100 మొక్కలు నాటి గ్రామం లో మొక్కలు పెంపకంపై అవగాహన ర్యాలీ నిర్వహించారు.

# అనంత లైబ్రేరీలో మహాత్మా గాంధీ వర్ధంతి



నివాళులు అర్పిస్తున్న గ్రంథాలయ అధ్యక్షులు, సిబ్బంది తదితరులు

అనంతపురం న్యూటౌన్, జనవరి 30 ప్రభాతవార్త

జిల్లాకేంద్ర గ్రంథాలయంలో మహాత్మా గాంధీ వర్ధంతి నిర్వహించారు. సంస్థ అధ్యక్షులు ఎల్ ఎం ఉమామోహన్‌రెడ్డి, కార్యదర్శి పి.రమ, గాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసినివాలులు అర్పించారు. అధ్యక్షులు ఉమా మాట్లాడుతూ.. మన దేశానికి స్వాతంత్ర్యం తెచ్చిన మహాత్ముడు మనకు దూరమైన రోజు ఈ రోజు ఆయనకు నివాలులు అర్పించడం మనందరి బాధ్యత అన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ అధ్యక్షులు ఎల్‌ఎం మోహన్‌రెడ్డి, ఉపగ్రంథాలయ అధికారి వి.సుబ్బరత్నమ్మ, సిబ్బంది ఇంతియాజ్, రామాంజినమ్మ, కావేరి, బాషా, మల్లికార్జున, బాలచంద్ర, సరస్వతి, నాగమణి, శ్రీవిజయ, విద్యార్థులు, గ్రంథాలయ పాఠకులు పాల్గొన్నారు.

# సామాజిక సేవలో యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా




శౌచాలయంను చూపుతున్న విద్యార్థులు

అనంతపురం కల్చరల్, జనవరి 30 ప్రభాతవార్త

ఉరవకొండ పట్టణంలో యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ప్రాంతీయ కార్యాలయం, అనంత పురం సామాజిక సేవా ఫౌండేషన్ ఆధ్వర్యంలో గురుకుల బాలికల పాఠశాలలో విద్యార్థినుల సౌకర్యార్థం శౌచాలయమును నిర్మించి ఇవ్వడము జరిగింది. యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా రీజనల్ హెడ్ జితేంద్రకుమార్ మిశ్రా, శాఖ నిర్వాహణాధికారి రామాంజినేయులు, పాఠశాల ప్రిన్సిపాల్ సునీత, విద్యార్థినులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

# సమైక్యాంధ్ర కేసు కొట్టివేత



హాజరైన టిడిపి నేతలు

అనంతపురం అర్బన్, జనవరి 30 ప్రభాతవార్త

సమైక్యాంధ్ర ఉద్యమం సందర్భంగా 2013వ సంవత్సరంలో జరిగిన వైఎస్ఆర్‌సిపి తెలుగు దేశం పార్టీ గొడవకు సంబంధించిన కేసులో విజయవాడ స్పెషల్ కోర్టులో హాజరు అయిన తెలుగు దేశం పార్టీ జిల్లా అధ్యక్షులు కాలువ శ్రీనివాస్, పార్థసారధి, మాజీ శాసన సభ్యులు, మాజీ మంత్రి సునీత, రాష్ట్ర కార్యదర్శిలు ఆదినారాయణ బుగ్గయ్య చౌదరి, బివి వెంకట రాముడు ప్రకాష్ నాయుడు రాష్ట్ర క్రిష్టియన్ అధ్యక్షులు స్వామిదాస్ జిల్లా అధికార ప్రతినిధి సరిపూటి రమణ, మాజీ నగర అధ్యక్షులు కృష్ణ కుమార్, నాయకులు మణికంఠ బాబు సద్దల చెన్నప్ప, ఎల్లుట్ల వెంకటస్వామి మరూర్ గోపాల్, అశోక్ నగర్ శీన, పుట్లూరు నారాయణ స్వామి, కూచి హరి, వెంకటప్ప తదితరులు హాజరు అయ్యారు. అత్యున్నత న్యాయస్థానంలో వాదోపవాదనలు ముగిసిన తరువాత న్యాయమూర్తి అందరిని నిర్దోషులుగా పరిగనించి కేసును కొట్టి వేయడం జరిగింది.

# శ్రీ చైతన్యలో క్రీడా దినోత్సవం



క్రీడా దినోత్సవాన్ని నిర్వహిస్తున్న దృశ్యం

అనంతపురం న్యూటౌన్, జనవరి 30 ప్రభాతవార్త

నగరంఓలని కోర్టు రోడ్‌లోని శ్రీ చైతన్య పాఠశాలలో క్రీడా దినోత్సవాన్ని మంగళవారం ఘనంగా నిర్వహజంచారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఏఎస్‌పి హనుమంతు, ఏజిఎం సుబ్బారెడ్డి హాజరై ప్రారంభించారు. అనంతరం వారు మాట్లాడుతూ.. పిల్లలు మానసికంగా ఎదగాలంటే విద్యతో పాటు క్రీడలు కూడా ఎంతో అవసరమన్నారు. అనంతరం సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. క్రీడల్లో గెలుపొందిన వారికి బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ తబస్సుం శాంత వైస్ ప్రిన్సిపాల్ బాలకృష్ణ, డీన్లు సిరాజుద్దీన్, అప్పలనాయుడు, మహేష్ గంగాధర్ కోఆర్డినేటర్ శ్రీనివాసరావు, ప్రైమరీ కోఆర్డినేటర్ పూజా ప్రైమరీ ఇన్‌చార్జిలు నీరజ, భారతి, తేజశ్విని, పిఇటిలు కళ్యాణ్, గాయత్రి భరత్ ఖాసింబీ రాగిణి పాల్గొన్నారు.

# కూడేరులో ఉచిత వైద్య శిబిరం



వైద్యపరీక్షలు నిర్వహిస్తున్న డాక్టర్ లక్ష్మి నారాయణ

కూడేరు, జనవరి 30 ప్రభాతవార్త

స్థానిక మండల పరిధిలోని, జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం జల్లిపల్లి గ్రామంలో గ్రామ సర్పంచు ఉమా మహేశ్వరి అధ్యక్షతన డాక్టర్ ఎం.లక్ష్మి నారాయణ మండల వైద్యాధికారి వారి ఆధ్వర్యంలో నిర్మహించడం జరిగింది. ప్రత్యేక వైద్య నిపుణులు, డాక్టర్ అర్బన్ ఈఎన్‌టి, డాక్టర్ జి.ఎస్కుమ్ముదా, లేడీస్ స్పెషలిస్ట్, కంటి వైద్య నిపుణులు సహజయా, వైఎస్ఆర్‌సిపి జేసిఎస్ మండల కన్వీనర్ దేవేంద్ర, మంజునాథరెడ్డి, కార్యక్రమంలో పాల్గొన్నారు. అదే విధంగా సిహెచ్‌ఓ వరలక్ష్మి, హెల్త్ సూపర్‌వైజర్ ఎ.రవీంద్ర, ల్యాబ్ టెక్నీషియన్ వేణుగోపాల్, ఫార్మసిస్ట్ త్రివేణి, ఏఎస్‌ఎం లోకేశ్వరి, ఆశాలు పాల్గొన్నారు.

# టిసిసి పరీక్షలకు దరఖాస్తులు ఆహ్వానం

అనంతపురం న్యూటౌన్, జనవరి 30 ప్రభాతవార్త

టిసిసి-2024 డ్రాయింగ్, హ్యాండ్‌లూమ్ వీవింగ్, టైలరింగ్, ఎంబ్రాయిడరీలో లోయర్, హయ్యర్ గ్రేడలలో టెక్నికల్ సర్టిఫికెట్‌కోర్సు పరపీక్షలు 2024 ఏప్రిల్ నెలలో జరుగుతాయని, టిసిసి అర్హత పరీక్షలను ప్రభుత్వం గుర్తించబడిన కేంద్రాలలో నిర్వహిస్తామని ఇన్‌చార్జ్ డిఈఓ వి.నాగరాజు, ఏసి గోవిందనాయక్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 30 నుంచి దరఖాస్తులు అందుబాటులో ఉన్నాయని, ఫిబ్రవరి 29లోపు గడువు ముగుస్తుందన్నారు.

# ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి చొరవతో వినియోగంలోకి ధోబిఘాట్

## - ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలియజేస్తున్న రజకులు



ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలియజేస్తున్న రజకులు



బోరు వేయడంతో నీరు పడిన దృశ్యం

అనంతపురం, జనవరి 30 ప్రభాతవార్త బ్యూరో

రాప్తాడు ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి చొరవతో నియోజకవర్గంలో ఉన్న రజకులకు జీవనాధారమైన ధోబిఘాట్ వినియోగంలోకి వచ్చింది. రాప్తాడు సమీపంలోని పండమేరు పక్కన దోబి ఘాట్ ఏర్పాటు చేశారు. నీటి వసతి లేకపోవడంతో రజకులు ఇబ్బందులు పడుతుండేవారు. ఈ విషయాన్ని ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. వెంటనే స్పందించిన ఎమ్మెల్యే సొంతనిధులతో ఉచితంగా బోరు వేయించారు. అలాగే మరమ్మత్తులకు గురైన పైప్ లైన్ స్థానంలో కొత్త పైపులను ఏర్పాటు చేయించారు. ఎట్టకేలకు ఎమ్మెల్యే కృషితో దోబీఘాట్ వినియోగంలోకి రావడంతో రజకులంతా ఎమ్మెల్యేకి కృతజ్ఞతలు తెలిపారు.

# రోడ్డులో ఇంటి నిర్మాణం జరుగుతుందండంటూ కలెక్టర్‌కు ఓ మహిళ పిర్యాదు

## - కలెక్టర్ ఆదేశాలతో పామిడిలో ఇంటి నిర్మాణంపై అహూడా అధికారి విచారణ

## - అనుమతులు లేకుండా ఎలాంటి నిర్మాణాలు చేపట్టకూడదంటూ ఆదేశాలు



ఇంటి నిర్మాణ స్థలంలో విచారణ చేపడుతున్న అహూడా టౌన్ ప్లానింగ్ విభాగం అధికారి హరీష్.



ఇంటి నిర్మాణ స్థలంలో రోడ్డు ఎక్కడి వరకూ వస్తుందని పరిశీలిస్తున్న దృశ్యం

పామిడి, జనవరి 30 ప్రభాతవార్త

పట్టణంలో అనుమతులు లేకుండా ఎలాంటి నిర్మాణాలను చేపట్టరాదని ప్రభుత్వ నిబంధనలను అతిక్రమిస్తే చర్యలు తప్పవని అహూడా టౌన్ ప్లానింగ్ విభాగం అధికారి హరీష్ హెచ్చరించారు. పట్టణంలోని స్టేట్‌బ్యాంకు సమీపంలో పి.కొండాపురంకు చెందిన ఓ వ్యక్తి గ్రామపంచాయతీ అనుమతులు లేకుండా రోడ్డులో ఇంటి నిర్మాణ పనులు చేపడుతున్నాడంటూ ఓ మహిళ జిల్లా కలెక్టర్‌కు స్పందనలో ఫిర్యాదు చేయటంతో మంగళవారం ఈఓ చంద్రశేఖర్‌తో కలిసి అహూడా టౌన్ ప్లానింగ్ విభాగం అధికారి హరీష్ ఇంటి నిర్మాణ స్థలంలో విచారణ జరిపారు. ఈక్రమంలో ఇంటి నిర్మాణం చేపడుతున్న పి.కొండాపురంకు చెందిన సదరు వ్యక్తి నిర్మాణాలు రోడ్డులో నిర్మాణం చేయటం లేదని వివరిస్తుండగా ఇంతకీ మీరు ఎవరని ప్రశ్నించిన అహూడా అధికారి నిర్మాణాలకు అప్రూవల్ తీసుకున్నారా.. అప్రూవల్ పొందకుండా నిర్మాణ పనులు చపట్టరాదని తెలియజేస్తూ ఎవరి పేరు మీద నిర్మాణం జరుగుతుందో వారెక్కడ ముందు డాక్యుమెంట్‌తో సహా వారిని పిలిపించండి అంటూ గ్రామపంచాయతీ కార్యదర్శి చంద్రశేఖర్‌కు సూచించారు. అయితే సమీప ఇళ్ళ డాక్యుమెంట్స్, లేఅవుట్ డాక్యుమెంట్స్ అందుబాటు లేకపోవటం ఇంటి నిర్మాణం ఎవరి పేరు మీద జరుగుతుందో అసలైన వ్యక్తి డాక్యుమెంట్‌తో రాకపోవటం కారణంగా అన్ని వివరాలతో రిపోర్టు పంపించాలని గ్రామపంచాయతీ ఈఓ చంద్రశేఖర్‌కు తెలియజేశారు. ఇదిలావుండగా అనుమతులు లేకుండా నిర్మాణాలను చేపట్టరాదంటూ ఇంటి నిర్మాణ పనులను నిలిపివేయించిన గ్రామపంచాయతీ ఈఓ చంద్రశేఖర్ ఇంటి నిర్మాణం ఎవరి పేరు మీద జరుగుతుందో అసలైన వ్యక్తి రిజిష్టర్ డాక్యుమెంట్ లేకుండా కేవలం అగ్రిమెంట్ పత్రంతో ఇచ్చిన ధర ఖాస్తు ఆధారంగా ఇంటి నిర్మాణానికి అప్రూవల్ ఇస్తారా,, అన్నది తేలాల్సి వుంది. జిల్లా కలెక్టర్ ఆదేశాలతో ఇంటి నిర్మాణ స్థలంలో విచారణ చేసిన అహూడా టౌన్ ప్లానింగ్ విభాగం అధికారి హరీష్ మరోసారి ఇక్కడ పర్యటించి సమీప ఇళ్ళ డాక్యుమెంట్స్, లే అవుట్ డాక్యుమెంట్స్, ఇంటి నిర్మాణం ఎంరి పేరు మీద జరుగుతుందో అసలైన వ్యక్తి డాక్యుమెంట్ ఆధారంగా వారందరినీ విచారించి అసలు ఇంటి నిర్మాణం రోడ్డులో జరుగుతుందా.. లేక సదరు వ్యక్తి కొనుగోలు చేసిన స్థలంలోనే జరుగుతుందా.. అని నిర్ధారణ చేస్తూ జిల్లా కలెక్టర్‌కు నివేదిస్తారా.. లేక గ్రామపంచాయతీ ఈఓ చంద్రశేఖర్ పంపించబోయే రిపోర్టుతోనే విచారణను ముగిస్తారా.. అన్నది వేచిచూడాల్సిందే.

# సర్పంచుల న్యాయబద్ధమైన 16 డిమాండ్‌లు తక్షణమే పరిష్కరించాలి

## - అనంతపురం కలెక్టరేట్ ఎదురుగా సర్పంచుల నిరసన దీక్ష

శింగనమల, జనవరి 30 ప్రభాతవార్త

సర్పంచుల న్యాయబద్ధమైన 16 డిమాండ్ల తక్షణమే పరిష్కరించాలని కోరుతూ అనంతపురంకలెక్టరేట్ ఎదురుగా ఆంధ్రప్రదేశ్ సర్పంచుల సంఘం, ఆంధ్రప్రదేశ్ పంచాయితీరాజ్ ఛాంబర్ ఆధ్వర్యంలో పంచాయితీ రాజ్ జాతీయ అధ్యక్షులు వైవిబి.రాజేంద్ర ప్రసాద్, ప్రధాన కార్యదర్శి బిర్రు ప్రతాప్‌రెడ్డి, రాష్ట్ర సర్పంచుల సంఘం అధ్యక్షురాలు వానపల్లి లక్ష్మి ముత్యాలరావు ఆదేశానుసారం రాష్ట్ర పంచాయితీ రాజ్ ఛాంబర్ కార్యనిర్వహక కార్యదర్శి దేగల కృష్ణమూర్తి ఉమ్మడి జిల్లా సర్పంచులసంఘం అధ్యక్షులు గోనుగుట్ల భూషణ్ అనంతపురం పంచాయితీ రాజ్ ఛాంబర్ అధ్యక్షులు వేలూరి రంగయ్య రాష్ట్ర నాయకులు ఇస్మాయిల్‌ప్రతాప్‌నాయుడు ఆధ్వర్యంలో నిరసన దీక్ష ఏర్పాటు చేయడంజరిగింది.

ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. పంచాయితీరాజ్ వ్యవస్థని ఇప్పుడున్నరాష్ట్ర ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి నిర్వీర్యం చేశాడని మాకు రావలసిన నిధులు కూడా ఆయన మరొక కార్యక్రమాలకి ఉపయోగించుకున్నారని పంచాయితీరాజ్ నిధులు 8660 కోట్లు కూడా నిధులు దారి మళ్లించారని మాకు న్యాబద్ధమైన కోరికలు 16తో మహాత్మా గాంధీ వర్ధంతి సందర్భంగా కలెక్టరేట్ ఎదురుగా నల్ల కండువా నల్ల బ్యాడ్జీలతో మా సర్పంచులు నిరసన చేసే దౌర్భాగ్యం ఈ జగన్‌మోహన్‌రెడ్డి




మాట్లాడుతున్న సర్పంచులు

. ఈ కార్యక్రమంలో సర్పంచులు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు లెనిన్, ముత్యాలప్ప నాయుడు, కుళ్లాయప్పనాయుడు, వన్నూరు స్వామి, రాయదుర్గం తిరుపాల్, ఉజ్జినప్ప, సీనయ్య, రంగనాయకులు, నాగార్జున, రాజారెడ్డి, నాగముని, కంబగిరి మల్లికార్జున, వసంత్‌కుమార్ మల్లికారుజన తదితరులు పాల్గొన్నారు.

# మాదిగలను ఐక్యం చేసి సత్తా చాటుతాం

## - మాదిగల ఆత్మీయకలయికలో నాయకుల పిలుపు



మాట్లాడుతున్న నాయకులు

అనంతపురం న్యూటౌన్, జనవరి 30 ప్రభాతవార్త

మాదిగలపై జరుగుతున్నటువంటి అన్యాయాలను ఎదుర్కోవాలంటే మాదిగలను ఐక్యం చేసి సత్తా చాటాలని మాదిగ సంఘాల నాయకులు పేర్కొన్నారు. మంగళవారం ఆర్ అండ్ బి అతిథి గృహంలో మాదిగల ఆత్మీయకలయికను విజయవంతం చేయాలని మాదిగ సంఘాల నాయకులు విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ.. మాదిగలపై అనేక రకాల దాడులు దౌర్జన్యాలు హత్యాచారాలు పెరిగిపోయాయని వీటిని అరికట్టడానికి మాదిగలను ఏకతాటిపైకి తెచ్చి ఉద్యమించాలన్నారు. ఫిబ్రవరి 11న జరిగే మాదిగల ఆత్మీయ కలయికలో పాల్గొనడానికి ప్రతి ఒక్కరూ కదలిరావాలని పిలుపునిచ్చారు. సమావేశంలో నాయకులు సాకే హరి, జేబి సురేష్, నాగ భూషణ, హనుమంతు, మంత్రి సుదర్శన్, వైసీపీ సర్పంచు నారాయణ స్వామి, టిడిపి ఎస్సీ నాయకులు సాకే వెంకటేష్, చిర్రాళ్ల రామాంజినేయులు, పాలచర్ల ముత్యాలు, సాకే నరసింహులు, చంద్రశేఖర్, రాచేపల్లి రామాంజినేయులు, యాలేరు పెద్దన్న ,సీనియర్ జర్నలిస్ట్‌ప్రసాద్, పక్కీరప్ప, గంజి నరేష్, బేడ బుడగ జంగం అంజి, మల్లీ తదితరులు పాల్గొన్నారు.

# నేడు ఎస్టీ హాస్టల్ వార్డెన్ పదవీ విరమణ

అనంతపురం న్యూటౌన్, జనవరి 30 ప్రభాతవార్త



వార్డెన్ రావూరి వెంకటేశ్వర్లు

అనంతపురం రుద్రంపేటలో ఉన్న ఎస్టీ హాస్టల్ వార్డెన్ రావూరి వెంకటేశ్వర్లు బుధవారం పదవీ విరమణ చేయనున్నారు. ఆయన డీఎస్సీ పరీక్ష వ్రాసి ఓసి కేటగిరి కింద వార్డెన్‌గా ఎంపికై 18-12-1992న అనంతపురం నాయక్‌నగర్ నెం:1 ఎస్టీ హాస్టల్ వార్డెన్‌గా ఉద్యోగంలో చేరారు. ఆ తర్వాత రుద్రంపేట హాస్టల్, నల్లమాడ, రాగులపాడు, అనంతపురం నాయక్ నగర్ నెం:1, రుద్రంపేట, బుక్కరాయ సముద్రం ఎస్టీ హాస్టల్లో పనిచేశారు. ప్రస్తుతం అనంతపురం రుద్రంపేట హాస్టల్లో పనిచేస్తున్నారు. ఆయన ఈనెల 31న పదవీ విరమణ చేయనున్నారు. ఆయన 1997లో ఒక సారి, 2022 జనవరి 26న రెండో సారి ఉత్తమ వార్డెన్‌గా అవార్డు అందుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ...తాను వార్డెన్‌గా పనిచేసిన కాలంలో తన వద్ద చదివిన కొందరు విద్యార్థులు డాక్టర్లు, ఇంజనీర్లు, టీచర్లు, పోలీసులు అయ్యారన్నారు. దాదాపు 32 సంవత్సరాలు వార్డెన్‌గా పనిచేసి నిత్యం విద్యార్థుల మధ్య గడపడం చాలా సంతోషంగా ఉందని, అయితే పదవీ విరమణ పొందుతున్నందుకు కొంత బాధాగా ఉందన్నారు. తన ఉద్యోగ సర్వీసులో ఇప్పటి వరకు సహకరించిన గిరిజన సంక్షేమ శాఖ అధికారులు, ఉద్యోగులు, వార్డెన్లు, ప్రజా సంఘాల నాయకులు, పాత్రికేయులకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. తాను పదవీ విరమణ చేయనున్న సందర్భంగా అనంతపురంలో డ్రైవర్స్ కాలనీలో ఉన్న అలేఖ్య ఫంక్షన్ హాల్‌లో బుధవారం సాయంత్రం 5:30 గంటలకు పదవీ విరమణ సన్మాన సభ నిర్వహిస్తున్నామని, సన్మాన సభకు ప్రతి ఒక్కరు హాజరై జయప్రదం చేయాలని ఆయన కోరారు.

# బళ్లారిలో సౌహార్దతా మానవహారం ప్రదర్శన



మహాత్మాగాంధీ వర్ధంతి సందర్భంగా సౌహార్దతా మానవహారం ప్రదర్శన

బళ్లారి, జనవరి30, ప్రభాతవార్త; జాతిపిత మహాత్మా గాంధీ వర్ధంతి సందర్భంగా నగరంలోని గాంధీభవన్ నుంచి సౌహార్దతా జాతా ర్యాలీ ప్రదర్శన జరిగింది. ర్యాలీలో వివిధ సంఘ సంస్థలకు చెందిన ప్రముఖులతోపాటు గాంధేయవాదులు పాల్గొన్నారు. నగరంలోని రాయల్‌సర్కిల్, బెంగళూరు రోడ్డు, కార్ స్ట్రీట్, మోతీ సర్కిల్ మీదుగా రైల్వే స్టేషన్ పక్కన మహాత్మాగాంధీ విగ్రహం వద్దకు జాతా చేరుకుంది. ఈ సందర్భంలో గాంధీ విగ్రహానికి పుష్పాంజలి ఘటించారు. ఈ సందర్భంలో క్రిస్టియన్ ఫాదర్ ఐ-1 ఫింటో మాట్లాడుతూ మానవ సంబంధాలు సధృడం చేసుకునేందుకు, భావైక్యత చాటి చెప్పేందుకు ఇటువంటి కార్యక్రమాలు నిరంతరం జరగాలని చెప్పారు. ఈ సందర్భంలో బళ్లారి జిల్లా కన్నడ సాహిత్య పరిషత్ అధ్యక్షుడు డా.నిష్టిరుద్రప్ప మాట్లాడుతూ రాష్ట్రంలో శాంతి, సౌహార్దతా, సహజీవనం అత్యావశ్యకమని తెలిపారు. కార్యక్రమం రూపకర్త సత్యబాబు మాట్లాడుతూ సామరస్యంతో కూడిన ప్రజల జీవనం దేశాన్ని ప్రగతివైపు తీసుకెళ్తుందని అభిప్రాయం వ్యక్తం చేశారు. ప్రముఖ సాహితీవేత్త ఎన్.డి.వెంకమ్మ, పీఆర్ వెంకటేష్, కాంగ్రెస్ నాయకులు వెంకటేష్‌హెగడే, డా.కోటేశ్వరరావు తదితరులు మాట్లాడారు. జాతాలో హిందూ, క్రైస్తవ, ముస్లీం, జైన్ సముదాయాలకు చెందిన వ్యక్తులతో పాటు దళితపర, కన్నడపర, కార్మికుల, రైతుసంఘాల జమాతే ఇస్లాంకు చెందిన పలువురు నాయకులు, జిల్లా వక్ఫ్‌బోర్డు అధ్యక్షుడు హుయూన్‌ఖాన్, మహ్మద్‌రఫీ, నదాఫ్, ఘని, హరిచరణ్, రైతు నాయకులు సంగనకల్ కృష్టప్ప, కొళగల్ ఎర్రిస్వామి, న్యాయవాది బాదామి శివలింగనాయక్, గంగన్నపత్తార్ తదితర నాయకులు పాల్గొన్నారు.

# మే నెలలో తెలుగు సంస్కృతి సమితి స్వర్ణోత్సవాలు

బళ్లారి, జనవరి30, ప్రభాతవార్త; బళ్లారి తెలుగు సంస్కృతి, సమితి ఏర్పడి 50 సంవత్సరాలు పూర్తి అయిన సందర్భంగా మే నెలలో స్వర్ణోత్సవాలు జరిపేందుకు నిర్ణయించినట్లు సమితి అధ్యక్షుడు జి.గోపాలకృష్ణ, ప్రధాన కార్యదర్శి జి.ప్రభాకర్‌లు తెలిపారు. ఈ మేరకు సమితి పదాధికారుల ముందస్తు ఏర్పాట్ల సమావేశం జరగగా, మే నెలలో స్వర్ణోత్సవాలు అత్యంగ ఘనంగా జరపనున్నట్లు తెలిపారు. స్వర్ణోత్సవాల సందర్భంగా తెలుగు సంస్కృతి, సాంప్రదాయాలు మేళవింపుతో అనేక కార్యక్రమాలు జనరంజకంగా ఉండేలా కార్యవర్గసభ్యులు తీర్మానించినట్లు పేర్కొన్నారు. తెలుగు నాటకాల ప్రదర్శనతోపాటు ఏకపాత్రాభినయాలు, అవధానం, భువనవిజయం, జానపద, శాస్త్రీయ నృత్య పోటీలను నిర్వహించి స్వర్ణోత్సవ వేడుకల్లో విజేతలకు బహుమతుల ప్రదానం చేయడం జరుగుతుందన్నారు. తెలుగు ప్రజలంతా స్వర్ణోత్సవాల్లో పాల్గొని తెలుగు సంస్కృతి సమితి ఆహ్వానం మేరకు పలువురి ప్రముఖుల్ని స్వర్ణోత్సవ వేడుకల్లో పాలు పంచుకునేలా పోరాటం జరుగుతుందన్నారు. సమావేశంలో సమితి కార్యవర్గ సభ్యులు లక్ష్మినారాయణ, డా.దేవన్న, డా.జి.ఆర్ వెంకటేశ్వర్లు, వెంకటేశులు, ఎం.రామాంజనేయులు, గౌరీప్రసాద్, జి.వెంకటేశులు పాల్గొన్నారు.

# నియోజకవర్గంలో పెరిగిన ఓటర్లు 9,334

## - గత ఎన్నికల్లో ఓటర్లు 2,34,741 - ప్రస్తుతం ఓటర్ల సంఖ్య 2,44,075 - మొత్తం ఓటర్లు: 2,44,075 - పురుషులు : 1,21,499 మహిళలు : 1,22,552 ఇతరులు : 24



గత ఎన్నికల్లో ఓటుహక్కును వినియోగించుకుంటున్న ఓటర్లు



నియోజకవర్గ పోలింగ్ కేంద్రాల రూటు మ్యాప్

తాడిపత్రి, జనవరి 30 ప్రభాతవార్త:

: తాడిపత్రి నియోజకవర్గ ఓటరు జాబితాను ఈఆర్‌వో వనప్రసాద్, ఎన్నికల డిప్యూటీ తహసీల్దార్ నాగేంద్ర ప్రసాద్‌లు ఇటీ వల ప్రకటించారు. నూతన ఓటరు జాబితా ప్రకారం నియో జకవర్గంలోని నాలుగు మండలాలు, తాడిపత్రి పట్టణంతో సహా 2,44,075 మంది ఓటర్లు ఉన్నారు. పురుషులు 1,21, 499 మంది ఉండగా మహిళలు 1,22,552 మంది, ఇతరులు 24 మంది ఉన్నారు. గత ఎన్నికలతో పోలిస్తే ఈ ఎన్నికల నాటికి 9,334 మంది పె రిగారు. జాబితాలను పోలింగ్ కేంద్రాల వారీ గా వేరుచేసి ప్రధాన రాజకీయ పార్టీల వారికి అందజే యడంతో పాటు మార్పులు చేర్పులకు ఈ నెల 31 వరకు అవకాశం కల్పిస్తు న్నట్లు అధికారులు పేర్కొన్నారు. గత ఎన్నికల్లో పురుషులు 1,17,641 మంది ఉండగా, మహిళలు 1,17,082 మంది ఉన్నారు.

ప్రస్తుతం ప్రకటిం చిన జాబితా ప్రకారం మహిళా ఓటర్లు 1,053 మంది ఎక్కువగా ఉండటం విశేషం. తాడిపత్రి నియోజకవర్గానికి సంబంధించి రానున్న ఎన్నికల్లో మహిళా ఓటర్లదే కీలక పాత్ర అనే విషయం అందరికీ తెలిసిందే.

**:: నియోజకవర్గంలో మండలాల వారీగా ఓటర్ల వివరాలు ఇలా ఉన్నాయి.**

తాడిపత్రి పట్టణంలో పురుషులు 41,498 మంది, మహిళలు 43,360 మంది, ఇతరులు 14 మంది వంతున మొత్తం 84,872 మంది ఓటర్లు ఉన్నారు. తాడిపత్రి మండలంలో 24,755 మంది పురుషులు, 24,998 మంది మహిళలు, ఇతరులు ముగ్గురు చొప్పున మొత్తం 49,756 మంది ఉన్నారు. యాడికి మండలంలో 23,286 మంది పురుషులు, 23,008 మంది మహిళలు, నలుగురు ఇతరులు చొప్పున 46, 298 మంది ఉన్నారు. ఇక పెద్దవడుగూ రు మండలంలో 18,308 మంది పురుషులు, 18,012 మంది మహిళలు, ఇతరులు ఒకరు చొప్పున మొత్తం 36,321 మంది ఓటర్లున్నారు. పెద్దపప్పూ రు మండలంలో 13,65 2 మం ది పురుషులు, 13,174 మంది మహిళలు, ఇద్దరు ఇతరులు చొప్పున మొత్తం 26,828 మంది ఓటర్లున్నారు.

# జగనన్న సంక్షేమ పథకాలే విజయానికి సోపానాలు

## - ఎమ్మెల్యే జొన్నలగడ్డ పద్మావతి



గ్రామ సచివాలయాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే జొన్నలగడ్డ పద్మావతి

పుట్లూరు, జనవరి 30 ప్రభాతవార్త

ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పార్టీలకు అతీతంగా ప్రజలకు అందిస్తున్న సంక్షేమ పథకాలే వైసిపి విజయానికి సోపానాలని ఎమ్మెల్యే జొన్నలగడ్డ పద్మావతి పేర్కొన్నారు. పుట్లూరు మండలం మడుగుపల్లి గ్రామంలో డాక్టర్ వైఎస్‌ఆర్ రైతు భరోసా కేంద్రం, వైఎస్‌ఆర్ విలేజ్ క్లీనిక్, వెల్లుట్ల గ్రామంలో గ్రామ సచివాలయం, డాక్టర్ వైఎస్‌ఆర్ రైతు భరోసా కేంద్రం, వైఎస్‌ఆర్ హెల్త్ క్లీనిక్‌ల నూతన భవనాలను ఎమ్మెల్యే మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గత టిడిపి ప్రభుత్వం అభివృద్ధిని విస్మరించిందని అప్పట్లో ఏవైనా పథకాలు వర్తించాలంటే జన్మభూమి కమిటీల చుట్టూ ప్రదక్షిణలు చేయాల్సిన పరిస్థితి వుండేదని వైసిపి ప్రభుత్వంలో చరిత్రలో లేని విధంగా పెద్దఎత్తున సంక్షేమం అభివృద్ధి అందించామన్నారు. జగనన్న పాలనను చూసి ఓటమి భయంతో ప్రతిపక్షాలు కూటములుగా వస్తున్నాయని, తిప్పికొడుతూ రాబోయే ఎన్నికల్లో జగనన్నను మరో సారి ముఖ్య మంత్రిని చేసుకుందామని ఆమె కోరారు. ఈ కార్య క్రమంలో సమన్వయకర్త ఎం. వీరాంజనేయులు, ప్రజా ప్రతినిధులు, మండల అధికారులు, వైసిపి నాయకులు, కార్యకర్తలు, వాలంటీర్లు, తదితరులు పాల్గొన్నారు.

# ఎన్ని కేసులు పెట్టినా చంద్రబాబు నిజాయితీకి మరక అంటించలేరు

## - మాజీ మంత్రి పరిటాల సునీత వ్యాఖ్యలు



మాట్లాడుతున్న మాజీ మంత్రి పరిటాల సునీత

అనంతపురం, జనవరి 30 ప్రభాతవార్త బ్యూరో

చంద్రబాబుపై ఎన్ని కేసులు పెట్టినా న్యాయస్థానాల్లో ఆయన నిజాయితీ నిరూపితమవుతుందని మాజీ మంత్రి పరిటాల సునీత అన్నారు. సుప్రీం కోర్టులో ఇన్నర్ రింగ్ రోడ్ అంశంపై ప్రభుత్వం వేసిన పిటీషన్ కొట్టి వేసిన నేపథ్యంలో విజయవాడలో ఉన్న ఆమె మీడియాతో మాట్లాడుతూ.. వైసీపీ ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలు, అవినీతిపై పోరాడుతున్నారనే అక్కసుతో చంద్రబాబుపై అవినీతి మరక అంటించాలని చూస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇప్పటికే ఆయనపై అనేక కేసులు పెట్టి జైలు పాలు చేశారన్నారు. అయినప్పటికీ న్యాయం ఎప్పటికైనా గెలుస్తుందన్న నమ్మకం చంద్రబాబు పోరాడుతున్నారని సునీత అన్నారు. తాజాగా సుప్రీం కోర్టు జగన్ సర్కార్‌కు చెంప పెట్టు లాంటి తీర్పు ఇచ్చిందన్నారు. అధికార గర్వంతో జగన్‌రెడ్డి అండ్ కో పెట్టిన కేసులు తప్పుడివి అని సుప్రీం కోర్టు తీర్పుతో వెల్లడైందన్నారు. ఐఆర్ఆర్ కేసులో సహ నిందితులపై ఉన్న ఉత్తర్వులు చంద్రబాబుకూ వర్తిస్తాయని సుప్రీం కోర్టు స్పష్టం చేసిందన్నారు. గతంలో హై కోర్టుచెప్పినా వినకుండా మళ్లీ సుప్రీం కోర్టుకు వెళ్లారన్నారు. నిజం గెలవడానికి ఆలస్యం కావచ్చు కానీ కచ్చితంగా గెలుస్తుందనే విషయాన్ని ఇప్పటికైనా జగన్‌రెడ్డి అర్థం చేసుకోవాలన్నారు. ప్రస్తుతం చంద్రబాబు రా కదలిరా సభలకు వస్తున్న జనం చూస్తుంటే ఆయనపై ప్రజలు ఎంత నమ్మకంపెట్టుకున్నారో అర్థమవుతో oదన్నారు. తెలుగుదేశం పార్టీకి 5 కోట్ల ప్రజలే స్టార్ క్యాంపైనర్లని, అవినీతి, అక్రమాల్లో కూరుకు పోయిన ప్రభుత్వాన్ని ఇంటికి పంపే రోజులు ఇక ఎంతో దూరంలో లేవన్నారు. హత్యలు, ఆత్మహత్యలు, వరకట్న వేదింపులు, అత్యాచారాలు, లైంగిక వేదింపులే ఇలా అన్ని నేరాల్లో ఏపిలో ముందుంజలో ఉందన్నారు. కానీ ప్రజలకు మంచి చేయడంలో మాత్రం చివరన ఉందని కామెంట్ చేశారు. ఇప్పటికే ప్రజలు టీడీపీ మ్యానిఫెస్టోపై హర్షం వ్యక్తం చేస్తున్నారని, కచ్చితంగా చంద్రబాబును మరోసారి సిఎం చేసుకుం టున్నా రన్నారు. ఈ విషయాన్ని గమనించి, అలాగే జగన్‌రెడ్డి పెత్తందారి వ్యవస్థకు విసిగిపోయిన వైసీపీ నేతలంతా టిడిపిలో చేరుతున్నారన్నారు. త్వరలో వైసిపి ఖాళీ కావడం ఖాయమని సునీత అన్నారు.

# ఘనంగా గాంధీ వర్ధంతి వేడుకలు



మహాత్మా గాంధీ చిత్రపటానికి పూలమాలలు వేస్తున్న జడ్పి చైర్మన్ బోయ గిరిజమ్మ

అనంతపురం సిటీ, జనవరి 30 ప్రభాతవార్త

జాతిపిత మహాత్మా గాంధీ వర్ధంతి వేడుకలను జిల్లా వైకాపా కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. మహాత్మా గాంధీ చిత్రపటానికి జడ్పి చైర్మన్ బోయ గిరిజమ్మ, పెనుకొండ ఎమ్మెల్యే అనంతపురం పార్లమెంట్ కన్వీనర్ మాలగుండ్ల శంకర్ నారాయణలు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. స్వాతంత్ర్య సాధనలో మహాత్మ గాంధీ కీలక పాత్ర పోషించారన్నారు. శాంతి, అహింసతో స్వాత oత్ర్య సాధనకు కేంద్ర బిందువుగా నిలిచారన్నారు. ఆయన ఆశయాలను కొనసాగించడమే ఆయనకు మనం అర్పించే నిజమైన నివాళి అని కొనియా డారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర రాజకాభివృద్ధి సంస్థ చైర్మన్ మీసాల రంగన్న, జిల్లా ప్రధాన కార్యదర్శి కొండ్రెడ్డి ప్రకాష్‌రెడ్డి, వైసీపీ నేతలు పాల్గొన్నారు.

# బిజెపికి మళ్లీ అధికారం ఇస్తే దేశం అధోగతి

( మొదటి పేజీ తరువాయి ) తప్పుదోవ పట్టించడానికి ప్రయత్నిస్తున్నాడని వీటిని ప్రజలు తిప్పికొడతారని పేర్కొన్నారు. గత తెలుగుదేశం ప్రభుత్వం, వైఎస్‌ఆర్‌సిపి రెండు జాతీయ జనతా పార్టీకి బానిసలు తలొగ్గి ఆంధ్ర రాష్ట్రాన్ని తాకట్టు పెట్టారని విమర్శించారు. వ్యవసాయ రంగానికి, రైతులకు సంబంధించిన నల్ల చట్టాలను పార్లమెంట్‌లో భారతీయ జనతాపార్టీ తీసుకొని వస్తే పార్లమెంట్‌లో ఓట్లు వేసి మద్దతు తెలిపిన వారు రాష్ట్రంలో వచ్చేటప్పటికీ ప్రజలకు తప్పుడు సమాచారం అందజేసి రైతులకు మోసం చేస్తున్నారని పేర్కొన్నారు. వైకాపా ప్రభుత్వం ప్రజల నుంచి గురించి ఆలోచించడం లేదన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కులాల గురించి మాట్లాడటం సరికాదన్నారు. షర్మిల పర్యటన సభల్లో ఆమె ప్రభుత్వానికి ప్రశ్నిస్తున్న ప్రశ్నలకు సమాధానాలు ఇవ్వకుండా ఇతరుల చేతముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ఆమె వ్యక్తిగతం గురించి మాట్లాడించడం సమంజసం కాదన్నారు. ఇది కట్టడి చేయవలసిన బాధ్యత అన్నగా ముఖ్యమంత్రిగా అతని బాధ్యత అన్నారు. వైఎస్. జగన్‌మోహన్‌రెడ్డి ఎంపిగా ఉన్నప్పుడు తన తండ్రి ఆశయం నెరవేర్చాలని అందుకు ప్రజలను చైతన్యం చేస్తానని చెప్పిన అతను ముఖ్యమంత్రి అయిన తర్వాత దానిని తుంగలోకి తొక్కి తండ్రి ఆశయానికి నీరుగార్చారని విమర్శించారు. భారతీయజనతా పార్టీ పది సంవత్సరాలలో అధికారం చేపట్టినప్పుడు నుంచి నేటి వరకు 110 లక్షల కోట్లు అప్పులు చేసిందని అయితే గ్రామీణ ప్రాంతాల్లో కానీ పట్టణప్రాంతాల్లో కానీ ఎక్కడ అభివృద్ధి చేయలేదని విమర్శించారు. రానున్న ఎన్నికల్లో ఎన్ని కష్టాలు వచ్చినా వాటిని ఎదుర్కొని మడకశిరలో కాంగ్రెస్ అభ్యర్థి కె.సుధాకర్‌ను గెలిపించుకోవడంతోపాటు ఇక్కడ కాంగ్రెస్ జెండా ఎగురవేసి అసెంబ్లీతలో అడుగు పెట్టడం జరుగుతుందని ఆయన బల్ల గుద్ది పేర్కొనడం జరిగింది. మాజీ ఎమ్మెల్యే సుధాకర్ మాట్లాడుతూ.. రానున్న ఎన్నికల్లో ప్రతి ఒక్కరూ కష్టపడి పనిచేసే కాంగ్రెస్ అభ్యర్థి గెలుపుకు కృషి చేయడంతోపాటు రాష్ట్ర విభజన సమయంలో మనకు నష్టపోయిన వాటినిసాధించుకోవోడానికి, మన నియోజకవర్గం అభివృద్ధికి దృష్టిలో పెట్టుకొని ప్రజలు కాంగ్రెస్ పార్టీని ఆశీర్వదించాల్సిన అవసరంఎంతైనా ఉందన్నారు. ఈ సమావేశంలో నాయకులు ప్రభాకర్‌రెడ్డి, నరసింహామూర్తి, మంజునాథ్, గౌడప్ప, నాగరాజు, నాగభూషణం, డాక్టర్ రవిశంకర్, తిప్పే నరసప్ప, వరదరాజులు, ఐదు మండలాలకు చెందిన కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# ప్రజల శ్రేయస్సే జగనన్న లక్ష్యం

## - ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి



ఎమ్మెల్యే కేతిరెడ్డిని సన్మానిస్తున్న దృశ్యం

తాడిపత్రిఅర్బన్, జనవరి 30 ప్రభాతవార్త

ప్రజల శ్రేయస్సే ముఖ్య మంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి లక్ష్యమని ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి పేర్కొన్నారు. పట్టణంలోని 7వవార్డులో మంగళవారం ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వార్డులో ప్రతి ఇంటికి వెళుతూ ప్రజలకు ప్రభుత్వం నుండి అందుతున్న పథకాలను వివరించడంతో పాటు వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఆయా సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలని ఆయన అధికారులను ఆదేశించారు. రానున్న ఎన్నికల్లో మరోమారు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని ముఖ్యమంత్రిగా ఆశీర్వదించాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో వైసిపి నాయకులు, కార్యకర్తలు, ప్రజలు పాల్గొన్నారు.

# లేపాక్షి ఆలయ అభివృద్ధికి సహకరించండి

## - మంత్రి రోజాను కోరిన ఆలయ కమిటీచైర్మన్ రామానందన్



మంత్రి రోజాకు పుష్పగుచ్ఛం అందచేస్తున్న లేపాక్షి ఆలయ కమిటీచైర్మన్ రామానందన్

లేపాక్షి, జనవరి 30 ప్రభాతవార్త

శిల్పకళారామంగా పేరొందిన లేపాక్షి వీరభద్రస్వామి ఆలయం అభివృద్ధికి సహకరించాలని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సాంస్కృతిక పర్యాటకశాఖామంత్రి రోజాకు లేపాక్షి ఆలయం కమిటీ చైర్మన్ రామానందన్ విన్నవించారు. మంగళవారం తిరుపతిలో మంత్రి రోజాను కలిసి లేపాక్షి ఆలయ అభివృద్ధికి కృషి చేయాలని కోరారు. అదేవిధంగా గతంలో జరిగిన విధంగానే లేపాక్షి ఉత్సవాల నిర్వహణకు చర్యలు తీసుకోవాలని మంత్రిని కోరారు. లేపాక్షికి సమీపంలోని జటాయువు మోక్షఘాట్ పనులను పునరుద్దరించాలని మంత్రికి విన్నవించారు. మీ సహాయ సహకారాలు తమకు ఎల్లప్పుడూ వుండాలని మంత్రిని కోరారు. ఇందుకు సానుకూలంగా స్పందించిన మంత్రి రోజా లేపాక్షి ఆలయ అభివృద్ధికి, లేపాక్షి ఉత్సవాలు, జటాయువు మోక్షఘాట్ పునరుద్ధరణ పనులు కొనసాగించేందుకు తనవంతు కృషి చేస్తానని మంత్రి రోజా లేపాక్షి ఆలయ కమిటీ చైర్మన్ రామాన ంద న్‌కు సూచించారు.

# జగన్‌ను విమర్శించడమే ప్రతిపక్షాలు పనిగా పెట్టుకున్నాయి

## - అధికారంలోకి వస్తే ఏం చేస్తామో చెప్పే దమ్ము ప్రతిపక్షాలకు ఉందా.. - అర్బన్ ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి



పార్టీలో చేరిన యువకులతో ఎమ్మెల్యే అనంత



చిన్నారితో ఆప్యాయంగా ఎమ్మెల్యే అనంత

అనంతపురం సిటీ, జనవరి 30 ప్రభాతవార్త

.ప్రజాసంక్షేమానికి కృషి చేస్తున్న ముఖ్యమంత్రి వైఎస్. జగన్ మోహన్‌రెడ్డిని అనునిత్యం విమర్శించడమే ప్రతిపక్షాలు పని గాపెట్టుకున్నాయని, అనంతపురం అర్బన్ ఎమ్మెల్యే అనంత వెంకట రామిరెడ్డి విమర్శించారు. నగరంలోని 10వ డివిజన్‌లో మంగళవారం ఇంటింటికీ వైసీపీ కార్యక్రమాన్ని అర్బన్ ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించారు. వైసీపీ ప్రభుత్వ పాలనలో పేదలకు చేకూరిన మేలును వివరించే బ్రౌచర్లను ఇంటింటికీ అందించి మరోమారు రాబోయే ఎన్నికల్లో వైసీపీ ని ఆదరించాలని ప్రజలను కోరారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి పాలనలో పార్టీలు, కులాలకు అతీతంగా, అర్హత ప్రమానికంగా ప్రతి ఇంటికీ సంక్షేమ పథకాలు అందుతున్నా యన్నారు. 14 ఏళ్లపాటు ముఖ్యమంత్రిగా పని చేసిన చంద్ర బాబు నాయుడు ఏ ఒక్కరోజైనా ప్రజలకు మేలు చేయాలని ఆలోచించారా అని ప్రశ్నించారు. గతంలో అధికారం ఇచ్చినప్పుడు ప్రజలకు మేలు చేయని చంద్రబాబు,నేడు అధికారం ఇస్తే అది చేస్తాం.. ఇది చేస్తాం..అనికల్లిబుల్లి హామీలను ఇచ్చి ప్రజలను మభ్య పెట్టే ప్రయత్నం చేస్తున్నారన్నారు. చంద్రబాబు హామీలకు గతంలో అన్ని వర్గాలు మోసపోయాయని చంద్రబాబు హామీలను విస్వసించే పరిస్థితుల్లో రాష్ట్ర ప్రజలు లేరన్నారు. సీఎం జగన్‌పాలనలో మేలు జరిగిన ప్రజలంతా వైసీపీ స్టార్ క్యాంపెయిన్లు అన్నారు. అందుకు భిన్నంగా రాజకీయంగా నష్టపోయిన వారంతా చంద్ర బాబు స్టార్ క్యాంపెయిన్లుగా మారుతున్నారని ఎద్దేవా చేశారు. ఎవరెన్ని జతలు కట్టినా, ఎన్ని పార్టీలు ఏకమైనా రానున్న ఎన్నికల్లో మరోమారు వైసీపీ అధికారంలోకి వస్తుందని ధీమా వ్యక్తంచేశారు. కార్యక్రమంలో పలువురు ప్రజా ప్రతినిధులు, పార్టీ శ్రేణులు పాల్గొన్నారు.

# అగ్నిమాపక సిబ్బందికి సేఫ్టీ ప్రికాషన్స్



సేఫ్టీ ప్రికాషన్స్‌ను చూపుతున్న అగ్నిమాపక సిబ్బంది

అనంతపురం న్యూటౌన్, జనవరి 30 ప్రభాతవార్త

అనంతపురం జిల్లా అగ్నిమాపక సిబ్బందికి బూట్లు, డ్రాగన్ సెర్చ్ లైట్స్, ఫైర్ సేఫ్టీ హెల్మెట్స్, ఫైర్‌మెన్ యాక్స్, ఫైర్ సేఫ్టీ గ్లౌస్‌ను దాదాపు 3 లక్షల 14వేల విలువైన వస్తువులను అందించినట్లు జిల్లా అగ్నిమాపక అధికారి వి.శ్రీనివాసరెడ్డి తెలియజేశారు.

# మారెమ్మ ఆశీస్సులను పొందిన ఉరవకొండ ఎమ్మెల్యే పయ్యావుల కేశవ్

బెలుగుప్ప, జనవరి 30 ప్రభాతవార్త

బెలుగుప్ప మండల పరిధిలో విరుపాపల్లి, గంగవరం గ్రామాల్లో మారెమ్మ దేవి జాతరకు ఉరవకొండ ఎ మ్మెల్యే పయ్యావుల కేశవ్ మారెమ్మ దేవిని దర్శించి భక్తి శ్రద్దలతో అమ్మవారికి మొక్కులు తీర్చుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అమ్మవారికి ఎంతో భక్తితో పూజలు నిర్వహించాలని ఆ గ్రామ ప్రజలకు తెలియజేశారు.

# ఎలాంటి ఒత్తిళ్ళకు తలొగ్గద్దు



హాజరైన పోలీస్ అధికారులు, సిబ్బంది

మొదటి పేజీ తరువాయి ) బాధ్యతవహించాలన్నారు. ఎన్నికల దృష్ట్యా తుపాకుల లైసెన్స్‌లను కలిగిన వారిని క్షేత్రస్థాయిలో పరిశీలించాలని, వాటిని రెవెన్యూ రికార్డులతో సరిపోల్చి నిబంధనల ప్రకారం సీజ్‌చేయాలని, లైసెన్స్‌డ్ ఆయుధాలను వెంటనే పోలీస్ స్టేషన్‌నందు డిపాజిట్ చేయించుకొని ఎలక్షన్ కోడ్ అమలులో ఉన్నంతవరకు భద్రపరచాలన్నారు. క్షేత్రస్థాయిలో సమస్యలు సృష్టించే వ్యక్తులను గుర్తించి వారిలో సత్ప్రవర్తన వచ్చినందుకు వారిని బైండోవర్ చేయాలన్నారు. ఎన్నికల దృష్ట్యా ఎస్‌డిపిఓలు క్షేత్రస్థాయిలో భౌగోళికంగా పర్యటించి ఇంటిగ్రేటెడ్ చెక్‌పోస్టు లను ఏర్పాటు చేసి తగిన పోలీస్ సిబ్బందిని నియమించి సమర్థవంతంగా తనిఖీలు నిర్వహించాలన్నారు. ఎలాంటి అక్రమ రవాణాకు తావులేకు ండాక ట్టడిచే యాలని, గంజాయి,నాటుసారా, అక్రమరవాణాకు పాల్పడే వ్యక్తులను గుర్తించి, వారిపై పిడియాక్ట్ నమోదు చేయాలని, వివిధ పోలీస్ స్టేషన్‌ల్లో చెడునడత కలిగిన వ్యక్తులపై ఉన్న హిస్టరీ షీట్లు కొనసాగించాలన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్‌పి ఎన్. విష్ణు, డిఎస్‌పిలు శ్రీనివాసులు, వాసు దేవన్, కన్జక్షన్, శ్రీలత, హుసేన్‌పీరా, సిఐలు, ఎస్‌ఐలు సిబ్బంది పా ల్గొన్నారు.

# బాబుకు అవినీతి మరక అంటించ లేరు

మొదటి పేజీ తరువాయి )వాడుకోవాలని చూస్తున్నారన్నారు. జగన్ ఎన్ని కుట్రలు చేసినా రాష్ట్రంలోని ప్రజలు బాబు వెంటనే ఉన్నారని ప్రభుత్వ వైఫల్యాలను ఎత్తి చపినచంద్రబాబునాయుడు రా కదలిరా ద్వారా ప్రభుత్వం చేస్తున్న వైఫల్యాలను ఎత్తి చూపుతున్నారన్నారు.

టిడిపికి ఐదు కోట్ల ప్రజలే స్టార్ క్యాంపెనర్లు:

తెలుగుదేశం పార్టీకి ఐదు కోట్ల ప్రజలే స్టార్‌క్యాంపెనర్లు అని అవినీతి అక్రమాల్లో కూరుకుపోయిన ప్రభుత్వాన్ని ఇంటికి పంపే రోజులు దగ్గర పడ్డాయన్నారు. హత్యలు, వరకట్న వేదింపులు, హత్యాచారాలు, ఇలా అన్ని నేరాలు ఏపి ముందుంజలో ఉందన్నారు. టిడిపి మేనిఫెస్టోపై ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారని, కచ్చితంగా వచ్చే ఎన్నికల్లో చంద్రబాబును మరోసారి సీఎం చేసుకుంటామన్నారు. ఈ విషయాన్ని గుర్తించి జగన్‌మోహన్‌రెడ్డి పెత్తందారి వ్యవస్థకు విసిగిపోయి వైసీపీ నేతలంతా టిడిపిలోకి చేరుతున్నారని, చేరికలు మరిన్నిరోజులు కొనసాగుతాయని ఆయన తెలిపారు. వైఎస్‌సిపి ఈసారి బంగాళాఖాతంలో కలిసి పోవడం ఖాయమని కందికుంట పేర్కొన్నారు.

# పేదలకు ఆర్థిక చేయూత

## - ఎమ్మెల్యే జొన్నలగడ్డ పద్మావతి



సిఎంఆర్‌ఎఫ్ చెక్కులను అందజేస్తున్న ఎమ్మెల్యే

శింగనమల, జనవరి 30 ప్రభాతవార్త

అనారోగ్యంతో బాధపడుతున్న పేదలకు ముఖ్యమంత్రి సహాయ నిధి క్రింద ఆర్థిక చేయూతను సీఎం వై.ఎస్. జగన్‌మోహన్‌రెడ్డి అందిస్తూ వారి జీవితాల్లో వెలు గులు నింపుతున్నారని ఎమ్మెల్యే జొన్నలగడ్డ పద్మావతి అన్నారు. అనంతపురంలోని ఎమ్మెల్యే క్యాం పు కార్యాలయంలో నియో జకవర్గంలోని బుక్కరాయ సముద్రం, నార్పల, పుట్లూరు,యల్లనూరు, మండలాల పరిధిలోని బాధిత కుటుంబాలకు ఎమ్మె ల్యే జొన్నలగడ్డ పద్మావతి సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను అందజేశారు. బాధిత కుటుంబాలు, వారి ఆర్థిక సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకు రావటంతో స్పందించి ముఖ్యమంత్రి సహాయనిధి కింద 5 కుటుంబాలకు రూ.10.39 లక్షలు మంజూరు చేయించారు. ముఖ్యమంత్రి వైఎస్. జగన్‌మోహన్‌రెడ్డికి, ఎమ్మెల్యే జొన్నలగడ్డ పద్మావతికి బాధిత కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో వైఎస్‌ఆర్‌సిపి నియోజకవర్గ సమన్వయ కర్త యం. వీరాంజినేయులు, రాష్ట్ర నాటక అకాడమీ చైర్‌పర్సన్ సిహెచ్ ప్రమీల తదితరులు పాల్గొన్నారు.


**హిందూపురం పురపాలక సంఘం**

**"ఇ" ప్రొక్యూర్‌మెంట్**

**టెండరు నోటీసు నెం. 460-461/HDP/GENL/2023-24/TO, DT:25-01-2024**

| పని పేరు | పనుల సంఖ్య | అంచనా మొత్తం |
|---|---|---|
| 1. సాధారణ నిధులు | 2 నెం | రూ॥ 20.90 లక్షలు |

ఆన్‌లైన్‌లో షెడ్యులు
డౌన్‌లోడింగ్ ప్రారంభ తేది : 31-01-2024 ఉ॥ 11.00 గం॥లకు
ఆన్‌లైన్‌లో షెడ్యులు
డౌన్‌లోడింగ్ చివరి తేది : 14-02-2024 సా॥ 03.30 గం॥లకు
బిడ్ తెరిచే తేది : 14-02-2024 సా॥ 04.00 గం॥లకు

గమనిక : ఎగ్జిక్యూటివ్ అథారిటి వారి ఆదేశాల ప్రకారం ఏవేని మార్పులు చేసిన "ఇ"ప్రొక్యూర్‌మెంట్ ప్లేస్‌లో తెలుసుకోగలరు. తదుపరి వివరములకు "ఇ"ప్రొక్యూర్‌మెంట్ ప్లేస్‌లో పొందవచ్చును.

ఆఫీసు చిరునామా : కమిషనరు, హిందూపురం పురపాలక సంఘం,
ఫోన్ నెం : 9849907408

సం /- కమిషనరు, హిందూపురం పురపాలక సంఘం.